ప్రజాశక్తి

శనివారం 15 మార్చి 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఉక్కు నిరసనల హోరు



కూర్మన్నపాలెం కూడలిలో మాట్లాడుతున్న డాక్టర్ బి.గంగారావు

- సొంత గనులు, సెయిల్‌లో విలీనం కోసం నినదించిన కార్మికవర్గం
- ప్రైవేటీకరిస్తే ఊరుకునేది లేదని హెచ్చరిక
- కార్మికుల తొలగింపును ఆపాలని డిమాండ్

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై శుక్రవారం విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో నిరసనలు హోరెత్తాయి. కర్మాగారానికి సొంత గనులు కేటాయించి, పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని, సెయిల్‌లో విలీనం చేయాలని, కాంట్రాక్టు కార్మికుల తొలగింపులు ఆపాలని, కార్మిక నేతలకు ఇస్తున్న షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఈ నిరసనలు సాగాయి. ర్యాలీలు, మానవహారాలతో 'సేవ్ వైజాగ్ స్టీల్' పేరిట ఆందోళనకారులు పెద్దపెట్టున నినదించారు.

ఉక్కునగరం : ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలోని దీక్షా శిబిరానికి పెద్ద ఎత్తున కార్మికులు తరలివచ్చి నిరసన తెలిపారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం మొండి వైఖరి నశించాలని, కేంద్రం తీరు మారాలని నినాదాలు చేశారు. ప్లాంట్ అభివృద్ధికి పనికిరాని ప్యాకేజీ ఎందుకని మండిపడ్డారు. కార్మికులను ఉద్దేశించి సిపిఎం 78వ వార్డు (ఉక్కు నగరం) కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడారు. ప్లాంట్‌ను పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని డిమాండ్ చేశారు. ప్యాకేజీ పేరిట కేంద్రం ఆడుతున్న డ్రామాలను తెలియజేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, రమణమూర్తి, ఎన్.రామారావు, నీరుకొండ రామచంద్రరావు, దొమ్మేటి అప్పారావు, డి.సురేష్ బాబు, సిహెచ్.సన్యాసిరావు, వరసాల శ్రీనివాస్, పరంధామయ్య, తాటికొండ జగదీష్, మిగతా 2లో..



విశాఖ నగరంలో నిరసన ప్రదర్శన చేపడుతున్న జెఎసి నాయకులు, ప్రజలు

ఉష్ణోగ్రతల్లో వేగం

- విశాఖలో రెండు రోజుల్లో 35 నుంచి 37 డిగ్రీలు
- వేడి, ఉక్కపోతకు తోడు.. అక్కడక్కడా కరెంట్ కోతలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఎండా కాలం పూర్తిగా వచ్చేసినట్టే. తెలతెల్లవారుతూనే సూర్యతాపం క్రమంగా పెరుగుతోంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ రోడ్లపై జనం పలుచబడిపోతున్న పరిస్థితులు విశాఖ నగరంలో నెలకొన్నాయి. మార్చి సగంలోనే ఇలా ఉంటే మే నాటికి ఎండల తాపం ఎలా ఉంటుందోనన్న ఆందోళన ప్రజానీకంలో మొదలైంది. గడచిన రెండు రోజులుగా 35 నుంచి 37 డిగ్రీల ఉష్ణోగ్రతలు విశాఖలో నమోదయ్యాయి. ఈ ఏడాది క్రమంగా విశాఖ సహా పలుచోట్ల 45 డిగ్రీలు సెల్సియస్ దాటే అవకాశాలు ఉన్నాయని వాతావరణ నిపుణులు వెల్లడిస్తున్నారు. రాయలసీమలోని అనంతపురంలో 40 డిగ్రీలకు దగ్గర్లో మూడు రోజులుగా కొనసాగుతున్నాయి. పొడి వాతావరణం క్రమంగా పెరుగుతోందని విశాఖ, అమరావతి వాతావరణ కేంద్రం అధికారులు శుక్రవారం సాయంత్రం నివేదించారు. నగరంలో 2 నుంచి 3 డిగ్రీల ఉష్ణోగ్రతలు రానున్న వారం రోజుల్లో పెరుగుతాయని ఆ నివేదిక సారాంశం. ఉత్తర, దక్షిణ కోస్తా అలాగే రాయలసీమలో పలుచోట్ల వేడి గాలులు, పొడి వాతావరణం ఏర్పడి ఉక్కపోత పరిస్థితులు ఉంటాయని అధికారులు వెల్లడించారు. ఈ ఏడాది ఎండలు బాగా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయని అభిప్రాయపడుతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో అక్కడక్కడా వర్షాలు లేదంటే ద్రోణి, అల్పపీడన ద్రోణులు ఏర్పడితే తప్ప వాతావరణంలో చల్లదనం కనిపించే మిగతా 2లో..



ఎండలోనే సాగుతున్న ప్రయాణాలు

నేడు, రేపు మెడికల్ రిప్స్ రాష్ట్ర మహాసభలు

వార్త 8లో..

21న గోవాడ సుగర్స్ సమస్యలపై మహాధర్నా

వార్త 6లో..

హెచ్ఎస్ఎల్ డైరెక్టర్‌గా కిరణ్ బాధ్యతల స్వీకరణ

వార్త 8లో..



విశాఖ నగరంలో హోలీని సందడిగా జరుపుకుంటున్న విద్యార్థినులు

ఘనంగా హోలీ సంబరాలు

విశాఖ తీరానికి పోటెత్తిన యువత

వార్త 8లో..

జూ పార్కులో చిరుత కన్నుమూత

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖలోని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాలలో 20 ఏళ్ల వయస్సుగల సుధ (ఆడ చిరుత పులి) గురువారం రాత్రి మృతి చెందింది. ఈ విషయాన్ని జూ క్యూరేటర్ జి.మంగమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వృద్ధాప్యంతో పాటు తీవ్రమైన మయోకార్డియల్ కారణంతో చిరుత మృతి చెందినట్టు పోస్టుమార్టం నివేదిక తెలియజేస్తోందని పేర్కొన్నారు. సుధను 2008 జనవరి 31న తిమ్మాపురం గ్రామం, రుషికొండ రిజర్వు ఫారెస్ట్ నుంచి రెస్క్యూ చేసి విశాఖ జూ పార్కుకు తీసుకువచ్చినట్టు తెలిపారు. అడవిలో చిరుత పులి జీవిత కాలం 12 నుంచి 15 ఏళ్లు కాగా ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాల సిబ్బంది సంరక్షణలో సుధ 20 ఏళ్లు వరకూ జీవించిందని వెల్లడించారు.



చిరుతపులి మృతదేహం

గిరిజన ఉద్యమ నేత శరభన్న మృతి

- సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘం నేతలు ఘన నివాళి
- నేడు అంత్యక్రియలు



శరభన్న (ఫైల్)

శరభన్న పార్థివదేహం వద్ద నివాళ్లర్పిస్తున్న లోకనాథం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ / పెదబయలు / పాడేరు విలేకరులు

గిరిజన ఉద్యమనేత, సిపిఎం పెదబయలు మండల నాయకులు కె.శరభన్న అనారోగ్యానికి గురై విశాఖలోని కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతిచెందారు. ఆయన మృతికి సిపిఎం, సిఐటియు, ఆదివాసీ గిరిజన సంఘం నేతలు సంతాపం తెలిపారు. శరభన్న మృతి విషయం తెలిసిన వెంటనే సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కె.చిన్నం నాయుడు, సిహెచ్.కోటిబాబు, జివి.రమణ మూర్తి కెజిహెచ్‌కు వెళ్లారు. శరభన్న కుటుంబీకులను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ పెదబయలు మండలంలో గిరిజన సంఘం నేతగా శరభన్న అనేక పోరాటాలు, ఆందోళనలు నిర్వహించారని, గిరిజన హక్కుల కోసం నిరంతరం పనిచేశారని తెలిపారు. ముఖ్యంగా పివిజిటిల సమస్యలపై ఉద్యమాలు చేశారన్నారు. సిపిఎం కార్యకర్తగా మిగతా 2లో..

ఉక్కు నిరసనల హోరు

మొదటి పేజీ తరువాయి..

స్టీల్‌ప్లాంట్ అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు నమ్మి రమణ, మంత్రి రవి, వంశీ, అప్పారావు మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాలను తీవ్రంగా వ్యతిరేకించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ ప్రతినిధులు వైటి.దాస్, యు.రామస్వామి, సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరాజు, బిఎన్.రాజు, సుబ్బయ్య పాల్గొన్నారు.

అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన..

విశాఖ కలెక్టరేట్ : విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్, గురజాడ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. అక్కడి కూడలిలో మానవహారం నిర్వహించారు. అనంతరం సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ అధ్యక్షతన సభ జరిగింది. సభలో జెఎసి ఛైర్మన్ ఎం.జగ్గునాయుడు, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నాగభూషణం, సిఎఫ్‌టియుఐ జాతీయ అధ్యక్షులు ఎన్.కనకారావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం విశాఖ ఉక్కు కార్మికులు గాజువాకలో శుక్రవారం తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని ప్రభుత్వం పోలీసుల ద్వారా అడ్డుకోవడాన్ని, స్టీల్‌ప్లాంట్ నేతలపై నిర్బంధ చర్యలను జెఎసి తరుపున తీవ్రంగా ఖండించారు. వైసిపి ప్రభుత్వ నిర్బంధ కాండను వ్యతిరేకించిన కూటమి నేతలు అధికారం చేపట్టాక అవే నిర్బంధ చర్యలకు పూనుకోవడం అమానుషమన్నారు. ఈ చర్యలను వెంటనే విడనాడాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు అభివృద్ధి కోసం రూ.11440 కోట్లు ఆర్థిక ప్యాకేజీ ప్రకటించామని, ప్లాంటును లాభాల బాట పట్టించడమే తమ ధ్యేయమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లోని కూటమి నేతలు ప్రకటించారన్నారు. ప్యాకేజీతోనే ప్లాంట్ ప్రైవేటీకరణ సమస్యను పరిష్కారం చేసేసినట్లు ప్రజలను నమ్మింపజూసారన్నారు. ఈ ప్రకటనలకు ఆచరణ పూర్తి విరుద్ధంగా వుందన్నారు. ప్రకటించిన ప్యాకేజీలో సంస్థ ఉత్పత్తికి, ముడిసరుకుకు, కార్మికుల జీతాలకు నిధులు ఖర్చుచేయడం లేదన్నారు. పాత బ్యాంకు బకాయిలు తీరుస్తున్నారని తెలిపారు. కార్మికులకు నేటికీ 210 శాతం జీతాలు చెల్లించలేదన్నారు. పూర్తిస్థాయి ఉత్పత్తి జరగాలంటే సుమారు 40 వేల మంది పర్మినెంటు, కాంట్రాక్టు కార్మికులు అవసరమని, నేడు ఆ తీరున కార్మికులు ప్లాంట్‌లో లేరని తెలిపారు. ఐదు వేల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయడంలేదన్నారు. కాంట్రాక్టు కార్మికుల తొలగింపునకు జరుగుతున్న కుట్రలను తెలియజేశారు. కార్మిక నేతలకు ఇచ్చిన అక్రమ షోకాజ్ నోటీసులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉక్కు నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించాలన్నారు. సభలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె.అచ్యుతరావు, ఎపిసిసిటియు జిల్లా కార్యదర్శి వాసుదేవరావు, ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.తిరుపతిరావు, ప్రజా సంఘాల నాయకులు బి.పద్మ, ఎం.ఎ.బేగం, యుఎస్‌ఎన్.రాజు, ఎల్‌జె.నాయుడు, వై.రాజు, జి.రాంబాబు, కె.తాతబాబు, కె.సుధాకర్, ఎం.చంటి, కె.సత్యనారాయణ, పి.మణి, బి.జగన్, వి.కృష్ణారావు, పి.పైడిరాజు, ఎం.సుబ్బారావు, ఉరుకూటి రాజు, బి.వెంకటరావు, బి.ఈశ్వరమ్మ, బి.రమణి, బి.భారతి, పుష్ప, దేవుడమ్మ, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, ఎస్‌కె.రెహమాన్, తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మోసపూరిత ప్యాకేజీ ప్రకటించిందని వామపక్షాల, ప్రజా సంఘాల నేతలు అన్నారు. తక్షణమే కర్మాగారానికి సొంత గనులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ పిలుపు మేరకు శుక్రవారం అనకాపల్లిలోని నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద వామపక్షాల ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ పాత అప్పులు తీర్చడానికే ఉక్కుకు ఇటీవల ఇచ్చిన ప్యాకేజీని ఉపయోగిస్తున్నారన్నారు. ఇలా అయితే ప్లాంట్ ఎలా నడుస్తుందని ప్రశ్నించారు. ప్రజల ఆస్తి అయిన ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటామని చెప్పి నేడు ఉక్కు సమస్యను పట్టించుకోవడం లేదన్నారు. మోడీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయాలన్న ఆలోచనతోనే గనులు కేటాయించడం లేదన్నారు. అదే సమయంలో ఇంకా పనులు ప్రారంభం కాని మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు మాత్రం గనులు ఇవ్వాలని చంద్రబాబు నాయుడు మోడీని కలిశారని, ప్రభుత్వ రంగం అంటే ఆయనకు ఎంత చిన్న చూపో దీనిని బట్టి అర్థమవుతోందని తెలిపారు. కార్మికుల తొలగింపు హేయమన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.దొరబాబు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గంటా శ్రీరామ్, నాయకులు ఎ.రాజు, కె.తేలయ్య బాబు, జి.సుభాషిణి, బుగిడి నూక అప్పారావు, సిపిఐ నాయకులు ఆర్.అప్పలరాజు, కోరిబిల్లి శంకర్రావు, రాజు పాల్గొన్నారు.



అనకాపల్లిలో నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీల నాయకులు



పరవాడలో నినాదాలు చేస్తున్న కార్మికులు

పరవాడ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఉక్కు యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వం పూర్తి సామర్థ్యంతో నడిపించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో పరవాడ సినిమా హాల్ జంక్షన్ వద్ద శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, నాయకులు పి.నాయుడు, జి శ్రీనివాసరావు, ఎన్ గురునాధరావు, బి శ్రీను, కే నాయుడు పాల్గొన్నారు.

కొనసాగిన దీక్షలు

విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు శుక్రవారం నాటికి 1450వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు జగదాంబ జోన్ నాయకులు కూర్చున్నారు. వారినుద్దేశించి సంఘం సీనియర్ నాయకులు వై.రాజు మాట్లాడారు.

నాయకులు ఎం.సుబ్బారావు, కె.నరసింగరావు, ఎర్రి బాబు, జివిఎన్.చలపతి పాల్గొన్నారు.

అక్రమ అరెస్ట్‌లను ఖండిస్తూ..

గురువారం రాత్రి ఉక్కు ఉద్యమ నేతలను పోలీసులు ముందస్తు అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ ఎఐటియుసి ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం నరసింహనగర్ రోడ్డులో నిరసన తెలిపారు. ఎపి ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి మాట్లాడారు.

గిరిజన ఉద్యమ నేత శరభన్న మృతి

(మొదటి పేజీ తరువాయి..) అకింతభావంతో ప్రజా శ్రేయస్సు కోసం తన తుదిశ్వాస వరకూ పనిచేశారన్నారు. ఆయన మృతి పార్టీకి, గిరిజన ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు. శరభన్న మృతి పట్ల సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు.

శరభన్న ఉద్యమ ప్రస్థానమిదీ..

అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం అడుగులపుట్టు పంచాయతీ పరిధి వడ్డేపుట్టు గ్రామానికి చెందిన శరభన్న 15 ఏళ్లగా ఆదివాసీల సమస్యలపై ఎన్నో పోరాటాలు నిర్వహించారు. సిపిఎం మండల కమిటీ సభ్యునిగా, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షునిగా, సిఐటియు మండల కార్యదర్శిగా పనిచేశారు. ఎన్ని ఆటుపోట్లు వచ్చినా తట్టుకుని గిరిజన సమస్యల పరిష్కారానికి విశేషంగా కృషి చేశారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, గిరి గ్రామాల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలని, పివిటిజిలకు అంత్యోదయ కార్డులు ఇవ్వాలని, రహదారులు నిర్మించాలని ఉద్యమాలు నడిపారు. కొంతకాలంగా కేన్సర్‌తో బాధపడుతూ విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో కన్నుమూశారు.

నేడు అంత్యక్రియలు

శనివారం ఉదయం 11 గంటలకు శరభన్న స్వస్థలమైన అడుగులపుట్టు పంచాయతీ పరిధి వడ్డేపుట్టు గ్రామంలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబీకులు, సిపిఎం నాయకులు తెలిపారు

ఆదివాసీ ఉద్యమానికి తీరనిలోటు : సిపిఎం

శరభన్న మృతి గిరిజన ఉద్యమానికి తీరని లోటని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, పెదబయలు మండల కార్యదర్శి బొండా సన్నిబాబు అన్నారు. శరభన్న మృతి పట్ల సంతాపం తెలుపుతూ వారు శుక్రవారం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. శరభన్న చేసిన పోరాటాలు గిరిజనుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు.

ఉష్ణోగ్రతల్లో వేగం

(మొదటి పేజీ తరువాయి..) అవకాశాలు తక్కువన్నది తెలుస్తోంది.

కరెంట్ ఛార్జీల మోత మోగనుందా ?

ఓ పక్క మండే ఎండలు, మరోవైపు అక్కడక్కడా మొదలైన కరెంట్ కోతలు జనాన్ని ఇబ్బందుల పాల్జేస్తున్నాయి. విద్యుత్ వినియోగం పెరగనున్న నేపథ్యంలో ఛార్జీల మోత మోగనుందని స్పష్టమవుతోంది. ఇప్పటికే ట్రూ అప్, అదనపు ఛార్జీల పేరుతో కొన్ని సంవత్సరాల క్రితం వాడిన కరెంట్‌కు ఇప్పుడు వినియోగదారులపై ఛార్జీల భారం పడుతోన్న సంగతి తెలిసిందే. కూటమి ప్రభుత్వం పెంచిన భారాలు జనం నెత్తిన పడనున్నాయి.

రోడ్డు పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న టిడిపి నేత సోమును

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 92వ వార్డు పద్మనాభ నగర్‌లో రూ.20లక్షల నిధులతో ప్రధాన రహదారి పనులకు తెలుగుదేశం పార్టీ విశాఖ జిల్లా పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు నందవరపు సోము శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత ఐదేళ్లగా వైసిపి హయాంలో నిర్వహణను పూర్తిగా గాలికొదిలేయడంతో రోడ్లన్నీ అధ్వానస్థితికి చేరుకున్నాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్ల మరమ్మతులు, పునర్నిర్మాణం శరవేగంగా సాగుతున్నాయన్నారు. ఎఇఇ వెంకటలక్ష్మి, 92 వ వార్డు ప్రధాన కార్యదర్శి కంపర ఆనంద్, సాలాపు పైడిరాజు, ఇల్లపు తాత బాబు, చింతాడ పద్మ, గొల్లవిల్లి వెంకటరావు బుదిరెడ్డ అప్పలరాజు, రుద్రరాజు నారాయణరాజు, రమేష్ రాజు, కాకి అప్పారావు, బల్ల రామునాయుడు, కట్ట పెంటయ్య, మత్స్యపురి గౌరీప్రసాద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు

బాధిత రైతులకు న్యాయం చేయాలి



దీక్షా శిబిరంలో రైతులకు సంఘీభావంగా సిపిఐ నేతలు

ప్రజాశక్తి- పెందుర్తి : ఉత్తర సింహాచలం నుంచి పెందుర్తి వరకు ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రైల్వే అధికారులు సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో దీని కింద వెంకటాపురం నుంచి చింతల అగ్రహారం వరకు భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని సిపిఐ నేతలు కోరారు. శుక్రవారం పోర్లుపాలెం రైతుల ఆందోళన శిబిరాన్ని ఆర్ శ్రీనివాస్, వై రాంబాబు నేతృత్వంలో సిపిఐ బృందం సందర్శించి, రైతులతో మాట్లాడి పూర్వాపరాలు తెలుసుకున్నారు ఆందోళన చేస్తున్న రైతులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, మేఘాద్రి రిజర్వాయర్ ఆయకట్టుగా ఉన్న ఈ భూములను తరాలుగా సాగుచేస్తున్న రైతుల నుంచి లాక్కొని, ఇపుడు పరిహారాన్ని సింహాచలం దేవస్థానానికి ఇస్తామనడం సరికాదన్నారు సాగుపై సమగ్ర విచారణ చేపట్టి రైతులకు న్యాయం చేయాలని కోరారు. బాధిత రైతుల ఆందోళనకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో పార్టీ పెందుర్తి, బర్డన్ నగర్ శాఖ కార్యదర్శులు ఎస్. అసిరినాయుడు, ఎ. అన్నపూర్ణ, పెందుర్తి సభ్యులు అరుణ, డి.తాతారావు, బి. సింహాద్రి, బి.నాగేష్, జి. అప్పలనాయుడు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి- ఆనందపురం: గిడిజాల ఇండస్ట్రియల్ ఫీడర్ విద్యుత్ లైన్ నిర్వహణ, మరమ్మతుల నేపథ్యంలో ఈనెల 15న శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ విభాగం ఎఇఇ సురేష్‌కుమార్ తెలిపారు గిడిజాల, ముచ్చర్ల ,బాకూరుపాలెం, తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

నేడు ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి- ఆనందపురం: స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ శనివారం మండలంలో పర్యటించి, పలు కార్యక్రమాలలో పాల్గొంటారని ఎంపిడిఓ డాక్టర్ జానకి తెలిపారు. ఉదయం 9:30 గంటలకు గిడిజాల పంచాయతీ దిబ్బడిపాలెంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రలో వాటర్ ట్యాంకును ప్రారంభిస్తారన్నారు. సంబంధిత అధికారులు పాల్గొనాలని కోరారు

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి -పద్మనాభం :పద్మనాభం జంక్షన్‌లో అయ్యప్పస్వామి పుట్టిన సందర్భంగా భక్తులు, ప్రజలకు అయ్యప్ప మాల దీక్షాపరులు మజ్జిగ పంపిణీ చేశారు

విద్యార్థులను ఆకట్టుకునేలా బోధన చేయాలి

● గీతం ప్రొ వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ గౌతమ్‌రావు



మాట్లాడుతున్న గీతం ప్రొ వీసీ గౌతమ్‌రావు

ప్రజాశక్తి- విశాఖపట్నం: సాంకేతిక పరిజ్ఞానం గణనీయంగా పెరుగుతున్న కొద్దీ, దాని ప్రభావం విద్యార్థులపై అధికంగా ఉంటోందని, ముఖ్యంగా తరగతి గదిలో అధ్యాపకులు చెప్పే అంశాలను వినాలనే శ్రద్ధ తగ్గుతోందని, ఈ నేపథ్యంలో విద్యార్థులను ఆకట్టుకునే రీతిలో బోధన విధానాలు ఉండాలని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ప్రొవైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు అన్నారు. శుక్రవారం గీతం ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ కేంద్రం ఆధ్వర్యంలో 'స్టూడెంట్ ఎంగేజ్‌మెంట్ స్ట్రాటజీస్' అనే అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో మాట్లాడుతూ, తరగతి గదిలో అధునాతన బోధన పరికరాలను ఉపయోగించడం ఎంత ముఖ్యమో, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి సంప్రదాయ పద్ధతిలో మార్గదర్శకం కూడా అంత అవసరమన్నారు.

విద్యార్థులలో ఆసక్తి రేకెత్తించేలా పరస్పర చర్చలు, సందేహాలను నివృత్తి చేసే విధంగా బోధన జరగాలన్నారు. నేటి తరం విద్యార్థుల మానసిక ప్రవృత్తిని అర్థం చేసుకుని అధ్యాపకులు తరగతి గదిలో వ్యవహరించాలన్నారు. ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ జివిఆర్.శర్మ మాట్లాడుతూ తరగతులకు హాజరు కావాలన్న ఆసక్తి విద్యార్థులలో నిరంతరం కలిగేలా బోధన జరగాలన్నారు. విద్యార్థుల ఆలోచనలను తెలుసుకోవడం వారిని ప్రోత్సహించడం ముఖ్యమన్నారు. సృజనాత్మక విద్యాబోధన ద్వారా అధ్యాపకులు విద్యార్థులను ఏవిధంగా ఆకట్టుకోవచ్చో వివరించారు. కార్యక్రమంలో గీతం స్ట్రాటజిక్ ఇనిషియేటివ్స్ డైరెక్టర్ మంజులరావు, పాల్గొన్నారు. ఎఫ్‌డిపి పూర్తి చేసిన అధ్యాపకులకు సర్టిఫికేట్‌లు అందజేశారు.

ఉగాది నుంచి జాప్ సభ్యులకు ఉచిత వైద్యం

ప్రజాశక్తి- సీతమ్మధార : అక్కయ్యపాలెం లక్ష్మిగాయత్రి హాస్పిటల్ సౌజన్యంతో ఉగాది నుంచి జర్నలిస్ట్ యూనియన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) సభ్యులకు ఉచిత వైద్యసేవలు అందించేందుకు ఆసుపత్రి డాక్టర్ కాండ్రేగుల రామ్‌కుమార్ హామీ ఇచ్చారని జాప్ యూనియన్ అధ్యక్షులు సింగంపల్లి శ్రీనివాస్ తెలిపారు. గురువారం డాక్టర్ కాండ్రేగుల రామ్‌కుమార్‌ను యూనియన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, దుశ్శాలువాతో చిరు సత్కారం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కెవి రామకుమార్ మాట్లాడుతూ జాప్ సభ్యులకు ఉచిత వైద్యం అందిస్తామని, కేవలం మందుల ఖర్చులను మాత్రమే సభ్యులు భరించాలన్నారు. తెల్ల రేషన్‌కార్డు ఉన్న నిరుపేదలందరికీ తమ ఆసుపత్రిలో ఉచిత వైద్యం అందజేస్తామన్నారు.

ఈనెల 26న జాప్ ఉగాది సంబరాలకు ముఖ్య అతిథిగా రావాలని డాక్టర్ రామ్‌కుమార్‌ను .యూనియన్ అధ్యక్షులు సింగంపల్లి శ్రీనివాస్ ఆహ్వానించారు. కార్యక్రమంలో జాప్ నేతలు సురేష్, సిహెచ్ నాయుడు, సిహెచ్ కనకరాజు, వడ్డాది వెంకటేష్, రాపర్తి శ్రీనివాసరావు, రామకృష్ణ, పవన్ పాల్గొన్నారు.

ముచ్చర్లలో బెల్ట్‌షాపులను తొలగించండి

● మహిళల ఆందోళన : జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని నిర్ణయం

ప్రజాశక్తి -ఆనందపురం : గుడి, బడి అనే తేడాలేకుండా గ్రామంలో ఇష్టారాజ్యంగా బెల్ట్‌షాపులను ఏర్పాటుచేసి, మద్యం అమ్మకాలు చేస్తున్నారని ముచ్చర్ల మహిళలు ఆవేదన చెందుతున్నారు. వెంటనే గ్రామంలోని మద్యం బెల్ట్‌షాపులను తొలగించే చర్యలు చేపట్టాలని వేడుకున్నారు. ఇష్టారాజ్యంగా మద్యం అమ్మకాలతో గ్రామస్తులు, ముఖ్యంగా మహిళలు ఇబ్బందులు పడుతున్నామనివాపోతున్నారు. నీళ్లకుండీలు, శొంఠ్యాంలోని ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి మందుబాటిళ్లను తీసుకొచ్చి, ముచ్చర్లలో మూడుచోట్ల బాహాటంగానే అమ్మకాలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఏడాదికి రూ.3.30లక్షలను చెల్లించేలా ఒప్పందం జరగడంతో గ్రామంలోని రచ్చబండ, రామాలయం, పాఠశాల వద్ద మూడు చోట్ల బెల్ట్‌షాపులను ఏర్పాటు చేసి, ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే రూ.50వరకు అధిక ధరకు అమ్ముతూ మందుబాబుల జేబులు గుల్ల చేస్తున్నారని ఆంటున్నారు. గ్రామంలోనే విచ్చలవిడిగా మద్యం దొరుకుతుండడంతో మందుబాబుల ఆగడాలతో ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు. దీనికితోడు గ్రామంలోని కోళ్లు, మేకలను దొంగతనాలు కూడా జరుగుతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, ముచ్చర్లలోని మద్యం బెల్ట్‌దుకాణాలను తొలగించే చర్యలు చేపట్టాలని మహిళలు కోరుతున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు.

కంప్యుటేషనల్ టెక్నిక్స్‌పై సర్టిఫికేట్ కోర్సు



కోర్సు ప్రారంభోత్సవంలో విద్యార్థులతో ప్రొఫెసర్ వేదవతి

ప్రజాశక్తి- మధురవాడ : రసాయనిక, జీవశాస్త్రాలలోని క్లిష్టమైన సమస్యలను పరిష్కరించడానికి విద్యార్థులు, వృత్తి నిపుణులకు కంప్యుటేషనల్ టెక్నిక్‌లపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగం నిర్వహిస్తున్న స్వల్పకాలిక సర్టిఫికేట్ కోర్సును గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి శుక్రవారం ప్రారంభించారు. పదార్థ విజ్ఞానం, ఔషధాల డిజైనింగ్, పర్యావరణ రసాయన శాస్త్రం వంటివి సమాజానికి ఉపయోగపడాలంటే ప్రత్యేక దృష్టి అవసరమన్నారు. సిద్ధాంతాల రూపంలో ఉండే శాస్త్రవిజ్ఞానం ప్రాక్టికల్‌గా ప్రజావసరాలకు, పరిశ్రమలకు ప్రయోజనం కలిగించేలా విశ్వవిద్యాలయాలలోని మేధావులు కృషి చేయాలన్నారు.

రసాయన శాస్త్ర విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎన్‌విఎస్. వేణుగోపాల్ మాట్లాడుతూ రసాయన శాస్త్ర పరిశోధనలలో కంప్యుటేషనల్ టెక్నిక్‌లకు ప్రాధాన్యత ఉందని ముఖ్యంగా పారిశ్రామిక రంగంలో ప్రయోజనాలు అనేకం అన్నారు. తమ విభాగం అందిస్తున్న సర్టిఫికేట్ కోర్సులో మూల సిద్ధాంతాలతో పాటు అధునాతన గణన పద్ధతులు, సాఫ్ట్‌వేర్ ఆధారిత అధ్యయనాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. పది రోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమంలో క్వాంటమ్ మెకానిక్స్, మాలిక్యూలర్ డైనమిక్స్, కంప్యుటేషనల్ పద్ధతులపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమానికి కోఆర్డినేటర్‌లుగా డాక్టర్ రాహుల్ శుక్ల, డాక్టర్ అనిక్ సేన్ వ్యవహరిస్తారన్నారు.

నేరాలు ఘోరాలు

హత్య కేసులో నిందితుడి అరెస్టు

ప్రజాశక్తి -చోడవరం : భూతగాదాలో ఓ వ్యక్తిని హత్య చేసిన కేసులో నిందితుడు నేమాలహరి సన్యాసిరావును పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. సీఐ పీ అప్పలరాజు తెలిపిన వివరాలు ప్రకారం.. చోడవరం బానయ్య కోనేరుకు చెందిన నేమాలహరి సన్యాసిరావుకు చోడవరం బాలాజీ నగర్‌కు చెందిన ఇందల సన్యాసిరావుకి మధ్య ఈ నెల 3వ తేదీ రాత్రి 9.30 గంటలకు తగాదా జరిగింది. ఈ నేపథ్యంలో ఇందల సన్యాసిరావును నేమాలహరి సన్యాసిరావు కొట్టడంతో ఇందల సిమెంట్ రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. అనంతరం బాధితుడిని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 12వ తేదీన పరిస్థితి విషమించి మరణించారు. దీంతో నేమాలహరి సన్యాసిరావుపై హత్య కేసు నమోదు చేసి అరెస్టు చేసి కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్లు సిఐ తెలిపారు.

విగ్రహ ప్రతిష్టకు ఏర్పాట్లు

ప్రజాశక్తి -పద్మనాభం: . మండలంలోని అగ్రహారం గ్రామపంచాయతీ లింగన్నపేట గ్రామంలో ఈనెల 15 నుండి 17 వరకు సిద్ది వినాయక సుబ్రహ్మణ్య స్వామి సహిత అభయాంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్టకు ఏర్పాట్లు పూర్తి చేశారు. 15న ప్రతిష్ఠాపన కుంకుమ పూజలు, 16న ప్రత్యేకపూజలు 17న పూజా కార్యక్రమాలతో పాటు అన్న సమారాధన నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ తెలిపింది.

టెన్త్ విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కస్తూర్బా, ఎపి బాలికల గురుకులం టెన్త్ విద్యార్థినులకు శుక్రవారం పలు అంశాలపై అవగాహన కల్పించారు హైదరాబాద్ ఇన్సూరెన్స్ కంపెనీ చీఫ్ అడ్వయి ర్ జరాజావు సురేష్‌కుమార్ పాల్గొని, పరీక్షలకు ఎలా సిద్ధమవ్వాలి, ఆరోగ్య పరంగా ఏమేమి జాగ్రత్తలు తీసుకోవాలి, తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో కెజిబివి ప్రిన్సిపల్ గంగా కుమారి, ఎపి బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ జయ ప్రకాష్, సామాజిక కార్యకర్త సంకురుభుక్త జోగారావు పాల్గొన్నారు

రాయితీపై పైపులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : 2024 -25 ఆర్థిక సంవత్సరానికి ఫుడ్ అండ్ న్యూట్రిషన్ సెక్యూరిటీ, నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్ అండ్ ఆయిల్ సీడ్స్ స్కీంలో భాగంగా రాయితీపై పివిసి పైపులు రైతులకు అందజేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి బి శివ కోమలి శుక్ర వారం ఒక ప్రకటనలో తెలిపారు.అవసరమైన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో సంబంధిత రైతు సేవా కేంద్రంలో సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

ఉత్సవాలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఈ నెల 27 నుంచి 30 వరకు స్థానిక గ్రామదేవత నూకాలమ్మ ఉత్సవాలను జయప్రదం చేయాలని ఉత్సవ కమిటీ అధ్యక్షులు అల్లిపిల్లి వేణుబాబు కోరారు. ఈనెల 15న అమ్మవారి దేవర చాటింపు, 27న తోలేళ్లు, 28న అనుపోత్సవం, 29న పాపమ్మ ఉత్సవాలు, 30న ఉగాది సంబరం జరుగుతుందన్నారు. సమావేశంలో ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి వై హరి, కోశాధికారి పిన్నింటి ఎర్రయ్య రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పాసి వినోద్‌కుమార్, కో ఆర్డినేటర్ జి సన్యాసి రావు పాల్గొన్నారు

నేడు ఆనందపురం మండల సమావేశం

ప్రజాశక్తి- ఆనందపురం: ఆనందపురం మండల సర్వసభ సమావేశం ఈ నెల 15న శనివారం ఉదయం 11 గంటల నుంచి నిర్వహించనున్నట్లు ఇఒపిఆర్‌డి సత్యనారాయణ తెలిపారు. అన్ని శాఖల మండల అధికారులు పూర్తి సమాచారంతో రావాలని, సర్పంచులు, ఎంపిటిసిలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

అంగన్వాడీ భవన ఆధునికీకరణ

ప్రజాశక్తి- తగరపువలస : భీమిలి మండలం చిప్పాడ దివీస్ ఆధ్వర్యంలో రూ 6.65 లక్షలతో తూడెంలోని అంగన్వాడీ కేంద్ర భవనానికి మరమ్మత్తు పనులు చేపట్టారు. వంట గది, కప్‌బోర్డ్, టైల్స్, స్లాబ్ మరమ్మతులు, థీమ్ పెయింటింగ్స్ పనులు పూర్తి చేశారు. గ్రామ సర్పంచ్ నరసయ్యమ్మ శుక్ర వారం పున ప్రారంభించారు. కార్యక్రమంలో దివీస్ సిఎస్ఆర్ మేనేజర్ డి సురేష్‌కుమార్, ప్రతినిధులు శ్రీనివాస్, నరసింహ పాల్గొన్నారు

ఐద్వా నేత అమ్ములమ్మకు సత్కారం



అమ్ములమ్మను సత్కరిస్తున్న ఐద్వా, లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ప్రజాశక్తి- మాధవధార : మహిళా హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారానికి 40ఏళ్లుగా మాధవధార ప్రాంతంలో అలుపెరుగని పోరాటం చేస్తున్న ఐద్వా నేత సనపల అమ్ములమ్మ అని పలువురు కొనియాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా లయన్స్‌క్లబ్, ఐద్వా సంయుక్త ఆధ్వర్యంలో అమ్ములమ్మను సత్కరించారు. మాధవధార గ్రామంలో మహిళా హక్కులు,,పేద ప్రజల ఇళ్ల స్థలాలకోసం,ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు జరిగిన అనేక పోరాటాల్లో అమ్ములమ్మ పాల్గొన్నారని, 75ఏళ్ల వయస్సు పైబడినా నేటికీ ఉత్సాహంగా ఉద్యమ కార్యక్రమాల్లో పాల్గొంటూ యువతకు స్ఫూర్తిమంతంగా నిలిచారన్నారు.కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు డాక్టర్ ప్రియాంక, లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ పి జి లక్ష్మీనారాయణ, కార్యదర్శి పిజి ప్రసాదరావు, కోశాధికారి హనుమంతరావు, బిఎన్‌ఆర్ ఫౌండేషన్ ప్రతినిధి లక్ష్మీకాంతం,కంచరపాలెం జోన్ మహిళా సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు

వివివిని సందర్శించిన ఎమ్మెల్సీ గాదె



ఎమ్మెల్సీ శ్రీనివాసులనాయుడును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-ఉక్కునగరం: ఉక్కునగరంలోని విశాఖ విమల విద్యాలయం(వివివి)ను ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు శుక్రవారం సందర్శించారు. ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పాఠశాలలో ప్రవేశాలపై ఆరా తీసి, ప్రగతిని ప్రశంసించారు.అన్ని వసతి, సౌకర్యాలతో రెండు వేలమందికి నాణ్యమైన విద్యను అందించడం ఆనందదాయకమన్నారు. పాఠశాలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందే విధంగా కృషి చేస్తానని, పాఠశాల భవిష్యత్ ప్రణాళికలపై ఉక్కు శాఖ మంత్రితో చర్చిస్తానని హామీనిచ్చారు. . ఈ సందర్భంగా కన్సాల్డేటెడ్ టీచర్స్ తమ సమస్యలపై ఎమ్మెల్సీకి విన్నవించారు అనంతరం ఎమ్మెల్సీ శ్రీనివాసులనాయుడును ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎం సిస్టర్ ఎలిరియా, ఉపాధ్యాయులు అనిత, జ్యోతి, శారద, సత్యం, దేవదాస్, సత్యవతి, పూర్వ విద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి జె.మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

కనులపండువగా డోలోత్సవం

ప్రజాశక్తి -పద్మనాభం :స్థానిక అనంతపద్మనాభ స్వామి డోలోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వామి తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా శ్రీదేవి భూదేవికి సమేతుడైన అనంతపద్మనాభ స్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ప్రతిష్టించి ప్రత్యేక పూజ కార్యక్రమాలు అనంతరం డోలో మండపానికి ఊరేగింపుగా తీసుకెళ్లి ఉత్సవాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా భక్తులు రంగులు చల్లుకున్నారు.

పెందుర్తి : :సింహాచలం వరాహలక్ష్మీనసింహస్వామి డోలోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. శుక్రవారం కొండదిగువనున్న గ్రామదేవత పైడితల్లమ్మ కుమార్తెతో పూర్ణిమ రోజున నిశ్చితార్థం చేసుకుంటాడని పురాణం. ఉత్సవాన్ని పురస్కరించుకుని మెట్ల మార్గంలో కొండదిగువకు చేరుకున్న స్వామినిసోదరి పైడితల్లమ్మతల్లి ఆలయానికి తీసుకెళ్లి, తర్వాత ప్రధాన కూడలిలోని పుష్కరిణి మండపంలో ఆలయ పండితులు డోలోత్సవం నిర్వహించారు.అనంతరం రంగులు చల్లుకుని సందడి చేశారు. స్వామి వివాహ నిశ్చితార్థాన్ని పురస్కరించుకుని పంచదార పానకాన్ని నివేదించారు. అనంతరం మూడు ప్రధాన మాడవీధుల్లో తిరువీధి నిర్వహించారు.

టమోటా ధర పతనం!

- గిట్టుబాటు కాక రైతుల గగ్గోలు
- గత్యంతరం లేక, వచ్చిన రేటుకే అమ్మకాలు
- కూలి, రవాణా ఖర్చులైనా రావడం లేదని ఆవేదన



మార్కెట్‌కు టమోటాలను అమ్మకానికి తెచ్చిన రైతు

గిట్టుబాటు కాని ధరతో టమోటా రైతు సతమతం

టమోటా పంట ధర ఒక్కసారిగా తగ్గిపోవడంతో గిట్టుబాటు కావడం లేదని రైతులు అంటున్నారు.

ప్రజాశక్తి -భీమునిపట్నం : టమోటా ధరలు భారీగా పతనం కావడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. నియోజకవర్గం పరిధిలోని భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో టమోటాను సాగుచేస్తుండగా, సీజన్‌లో పండించిన టమోటాలకు కనీస ధర గిట్టుబాటు కాకపోవడంతో పెట్టుబడులు మాట పక్కన పెడితే, ఏరివేత కూలీలు, రవాణా ఛార్జీలైనా రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. భీమిలి మండలం మజ్జిపేట, దాకమర్రి, తాటితూరు, లక్ష్మీపురం, కృష్ణంరాజు పేట, ఆనందపురం మండలం ఆనందపురం, గొట్టి పల్లి, చందక, పద్మనాభం మండలం కొత్త కొవ్వాడ, పాత కొవ్వాడ, అనంతవరం తదితర 200 పైచిలుకు ఎకరాల్లో టమోటాను రైతులు సాగుచేస్తున్నారు.

ఏటా పెరుగుతున్న పెట్టుబడులు

టమోటా సాగుకు ఏటా పెట్టుబడులు పెరుగుతున్నా, సీజన్‌లో సరైన ధరమాత్రం రావడం లేదని రైతులు అంటున్నారు. ఎకరా పంట సాగుకు రూ.50 వేలు దాకా ఖర్చవుతోందని, దుక్కులు, గొప్పులు, ఇతర సాగు పనులతోపాటు, ఎరువులు, నీటియాజమాన్యం, ఇతర సాగు అవసరాలకు పెట్టుబడుల ఖర్చు ఏయేటికాయేడు పెరుగుతున్నాయన్నారు.

ఇంటిల్లిపాది శ్రమించడంతోపాటు కూలీల ఖర్చులను పెట్టి, పండిన టమోటాలను ఏరి, ప్లాస్టిక్ కేట్లలోనూ, గోనెసంచుల్లో వేసి, ఉదయం ఆరుగంటలలోపే ఆటోల్లో మార్కెట్‌కు చేరవేస్తున్నారు. ఇంతగా వ్యయప్రయాసల కోర్చి పండిన టమోటాలను మార్కెట్‌కు తీసుకెళుతుండగా, ఒక్కోరోజు కొనే దిక్కు లేకుండా పోతోందని,ప్రస్తుత సీజన్‌లో కొనుగోలు చేసినా కిలో రూ.ఆరేడుకు మించి ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. కిలో రూ.15 నుంచి రూ.20 వరకు పలికితేనే, లాభాల మాట పక్కనపెడితే, పెట్టుబడులు వచ్చే పరిస్థితి ఉన్నా, అదెక్కడా కానరావడం లేదు.

దోచేస్తున్న దళారులు

ఇక ప్రైవేట్ మార్కెట్‌లో దళారులతో కొద్దిమంది వ్యాపారులు కుమ్మక్కై ధర నిర్ణయం, కొనుగోళ్లలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ, రైతులను ముంచేస్తున్నారనే ఆరోపణలున్నాయి. సిండికేట్టుగా మారి మార్కెట్‌లో రైతులను మభ్యపెట్టి కిలో రూ 6లు, రూ.7లకు కొనుగోలు చేసి, మార్కెట్‌లో నాలుగైదింతల ధరలకు అమ్ముకుంటూ దోచుకుంటున్నారని టమోటా రైతులు ఆవేదన చెందుతున్నారు. టమోటాలను నిల్వ ఉంచే వీలు, అవకాశం లేకపోవడంతో వచ్చిన ధరకు వదిలించు కోవడం తప్ప మరోమార్గం లేదని వాపోతు న్నారు. ఏటా సీజన్‌లో ఇదే పరిస్థితి నెలకొంటున్నా ప్రభుత్వపరంగా టమోటా రైతులను ఆదుకునే చర్యలు చేపట్టడం లేదని ఆందోళన వ్యక్తమౌతోంది.

టమోటా విక్రయాలకు చర్యలు

మార్కెట్ ఇంటర్వెన్షన్ అమలులో భాగంగా టమోటా అమ్మకాలకు చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలోని 13 రైతు బజార్లలో రైతుల అభీష్టం మేరకు గుర్తింపు కార్డులతో సంబంధం లేకుండా కిలో రూ.13 చొప్పున టమోటాలను అమ్ముకునే అవకాశం కల్పించాం. ధర గిట్టుబాటు కాకుంటే ప్రయివేటు మార్కెట్‌లోనూ అమ్ముకునే సౌలభ్యం రైతులకు ఉంది. ఏవైనా సమస్యలుంటే సమీప ఉద్యానశాఖ అధికారులను రైతులు సంప్రదించాలి.

– షేక్ యాసిన్, అసిస్టెంట్ డైరెక్టర్,
వ్యవసాయ మార్కెటింగ్ శాఖ,
విశాఖ జిల్లా.

వచ్చిన ధరకు అమ్మాల్సి వస్తోంది...



నవంబర్‌లో పంట వేసినప్పటి నుంచి జనవరిలో ఫలసాయం వచ్చే వరకు రెండున్నర నెలలకు పైగా శ్రమించి, పండించినా ఫలితం లేని పరిస్థితి. 30 సెంట్ల లో టమోటా సాగుకు అన్నివిధాలా దాదాపు రూ.40 వేల వరకు పెట్టుబడులయ్యాయి. మార్కెట్‌లో టమోటాకు కనీస ధర లేకపోవడంతో పెట్టుబడులైనా వచ్చే పరిస్థితి లేదు. వచ్చిన ధరకు అమ్ముకోక తప్పడం లేదు.

– మజ్జి లక్ష్మణరావు, టమోటా రైతు
మజ్జిపేట, భీమిలి మండలం.

ఏమీ మిగలడం లేదు...



ఎకరాలకు సగటున రూ.60వేలు మదుపులు పెట్టి రెండెకరాల్లో టమోటా సాగు చేశాను. ప్రైవేట్ మార్కెట్‌లో 30 కిలోలు కెటిల్ రూ.250లకు అమ్మాల్సి వస్తుంది. సాగు పెట్టుబడులు, ఇపుడు ఏరివేత, రవాణా ఛార్జీలు ఇతరత్రా ఖర్చులన్నీ పోను, టమోటాలను అమ్మితే ఏమీ మిగలడం లేదు. ప్రభుత్వపరంగా ఆదుకునే చర్యలు చేపట్టాలి.

– తమటపు సన్యాసినాయుడు, టమోటా రైతు,
పాత కొవ్వాడ, పద్మనాభం మండలం.

క్లౌడ్ పరిజ్ఞానంతో ఐటి రంగంలో మార్పులు

గీతంలో జె.పి.మోర్గాన్ ఉపాధ్యక్షురాలు బండి తారక



తారకను సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

ప్రజాశక్తి- మధురవాడ : ఐటి రంగంలో 2006 తరువాత క్లౌడ్ సాంకేతిక పరిజ్ఞానం, అలాగే అమేజాన్ వెబ్ సర్వీసెస్ (ఎడబ్ల్యుఎస్) గణనీయమైన మార్పులను తీసుకొచ్చిందని, ఐటి పరిశ్రమలు సైతం సంబంధిత సర్టిఫికేట్ కోర్సులు పూర్తి చేసిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నాయని జె.పి.మోర్గాన్ ఉపాధ్యక్షురాలు బండి తారక అన్నారు. శుక్రవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజి సిఎస్ఇ విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ, సర్వర్ అవసరం లేని విధంగా కంప్యూటింగ్ చేయడానికి, డేటా స్టోరేజ్, నెట్‌ఫ్లిక్స్ వంటివి అంతరాయం లేకుండా సేవలు అందించడానికి అమెజాన్ క్లౌడ్ ఫ్రెంట్ వంటివి ఎలా ఉపయోగపడతాయో వివరించారు. సైబర్ దాడుల నుంచి డిజిటల్ సమాచారాన్ని ఎలా సంరక్షించుకోవాలో తెలిపారు. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విద్యార్థులు ఎడబ్ల్యుఎస్ కోడ్ పైప్‌లైన్, కోడ్ డిప్లాయ్, క్లౌడ్ ఫార్మేషన్ వంటివి అధ్యయనం చేయాలని సూచించారు. ప్రస్తుతం ఐటి రంగంలో ఎడబ్ల్యుఎస్ సర్టిఫైడ్ సొల్యూషన్స్ ఆర్కిటెక్ట్, సర్టిఫైడ్ క్లౌడ్ ప్రాక్టిషనర్ ఉద్యోగాలకు డిమాండ్ ఉందని తెలిపారు. విద్యార్థులు టిసిఎస్ కోడ్ విటా, గూగుల్ కిక్ స్టార్ట్ వంటి పోటీలలో పాల్గొని నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గీతం స్కూల్‌ఆఫ్ టెక్నాలజి డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు ఎడబ్ల్యుఎస్ సంబంధిత స్టిఫికేట్ కోర్సులలో చేయడం ద్వారా ఐటి రంగంలో అవకాశాలను అందుకోవాలన్నారు. కార్యక్రమంలో సిఎస్ఇ వివిభాగం అధిపతి డాక్టర్ లక్ష్మీశ్వరి, ఎఐ,డేటా స్ట్రక్చర్స్ విభాగం అధిపతి డాక్టర్ కె.నవీన్ కుమార్,కార్యక్రమం కోఆర్డినేటర్ డాక్టర్ కె.విజయకుమార్ పాల్గొన్నారు.

ఐదో వార్డులో రింగ్ పోల్ లైట్లు

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి ఐదోవార్డులో శాశ్వత వీధి దీపాల ఏర్పాటుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నామని కార్పొరేటర్ మొల్లి హేమలత అన్నారు. శు క్రవారం వార్డు పరిధిలోని బోరవానిపాలెం, అంబేద్కర్ కాలనీ, జెఎన్‌యుఆర్‌ఎం, పిపి 2 కాలనీ, వికలాంగుల కాలనీ, స్వతంత్రనగర్, ఎన్టీఆర్ హుదూద్ కాలనీ తదితర ప్రాంతాల్లో సుమారు రూ.5 లక్షల వ్యయంతోరింగ్ ఫోల్ లైట్లును కార్పొరేటర్ ప్రారంభించారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ.వార్డు పరిధిలో వీధిదీపాల సమస్య తీవ్రంగా ఉన్న నేపథ్యంలో కౌన్సిల్ సమావేశాల్లో పలుమార్లు ప్రస్తావించి, జివిఎంసి కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా ఈమేరకు నిధులు మంజూరు చేశారని, వాటితో రింగ్‌పోల్ లైట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వార్డు పరిధిలోని మిగతా ప్రాంతాల్లోనూ వీధిదీపాల సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు. టిడిపి బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, జివిఎంసి విద్యుత్ ఎఇఇ గాయత్రి, తెలుగు మహిళ అధ్యక్షురాలు బోయి రమాదేవి, యువత అధ్యక్షులు కొండపు రాజు, కొత్తల శ్రీనివాసరావు, జోగేశ్వర పాత్రో, బోని నరసింహామూర్తి, మహాలక్ష్మి నాయుడు పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ మరియా మ్యూచ్‌వల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ త్రిఫ్ట్ ఆండ్ క్రెడిట్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆరిలోవ కాలనీలోఅంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. సంస్థలో 60 ఏళ్ళు నిండి, మ్యాక్స్ సభ్యత్వం విరమించిన 150 మంది సీనియర్ సభ్యులు వేడుకలో ఉత్సాహంగా పాల్గొన్నారు. సంస్థ ఎండి నిర్మల మాథ్యూ మాట్లాడుతూ సీనియర్ సభ్యుల సంక్షేమానికి ఎజిబిఎంలో చర్చించి నిర్ణయాలు తీసుకుంటామన్నారు. హెల్ప్ ఏజ్ ఇండియా డిజిటల్ అడ్రసీ రాష్ట్ర కోఆర్డినేటర్ కృష్ణారావు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అనంతరం సీనియర్ సభ్యులైన 150 మంది మహిళలకు రూ 2వేలు విలువ చేసే నిత్యావసర సరుకులు అందజేసారు. అన్నమ్మ నృత్య అకాడమీ చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందిన సీనియర్ మెంబర్స్‌కు సెయింట్ ఆన్స్ కాన్వెంట్ సుపీరియర్ సిస్టర్ పద్మిని, సిస్టర్ ఫిలో జోసెఫ్, సిస్టర్ ఆశ, ఇందిర బహుమతులు అందజేసారు.

అన్నసమారాధన

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని మద్ది గ్రామంలో అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని గ్రామ పురోహితులు వాసు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిచారు ఎంపిపి కె.రాంబాబు ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో అన్నసమారాధన నిర్వహించారు.



బాలికులకు కరాటేలో శిక్షణ ఇస్తున్న దృశ్యం

కేంద్రీయ విద్యాలయానికి శాశ్వత భవనాలు నిర్మించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి కేంద్రీయ విద్యాలయానికి శాశ్వత భవనాలు నిర్మించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం డిమాండ్ చేశారు. అనకాపల్లి మండలం సుందరయ్యపేట పంచాయతీ అచ్చియ్యపేటలో సర్వే సంఖ్య 511లో కేంద్రీయ విద్యాలయానికి కేటాయించిన పది ఎకరాల స్థలాన్ని శుక్రవారం సిపిఎం నేతలు సందర్శించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ అనకాపల్లి ఉడ్‌పేట పాఠశాల ప్రాంగణంలో 2024-25 విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించారని తెలిపారు. శాశ్వతంగా కేంద్రం విద్యాలయ నిర్మాణానికి రూ.28.74 కోట్లు కేటాయించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. కేంద్రీయ విద్యాలయానికి కేటాయించిన భూమికి సంబంధించిన నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని, వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలని, 25శాతం సీట్లు స్థానికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ స్థలంలో రూ.20 లక్షలతో వంతెన నిర్మించారని, విద్యుత్తు స్తంభాల ఏర్పాటుకు రూ.6 లక్షలు వెచ్చించారని, రూ.9 లక్షలతో ప్రాంగణంలో తుప్పలు, వ్యర్థాలు తొలగించారని, స్థలంలో చెట్లు తొలగింపునకు రూ.4.20 లక్షలు ఖర్చు చేసినట్లు అధికారులు ప్రకటించారని తెలిపారు.



కేంద్రీయ విద్యాలయానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

అయినప్పటికీ ప్రభుత్వం భవనాల నిర్మాణంలో నిర్లక్ష్యంగా ఉందని మండిపట్టారు. అనకాపల్లి ఎంపీగా ఉన్న బిజెపి నేత సీఎం రమేష్ కేంద్రీయ విశ్వవిద్యాలయం విషయంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించారన్నారు. కోట్ల రూపాయలు విలువ చేసే ఈ భూములను పెద్దలు కాజేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఈ స్థలంలో కేంద్రీయ విద్యాలయం కట్టకపోతే ఆ భూములను రైతులకు వెనక్కి ఇవ్వాలని, లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం జగనన్న కాలనీలను పరిశీలించి వాటిని అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, నాయకులు బి.ఉమామహేశ్వరరావు, కె.తేలయ్యబాబు, గండి నాయనబాబు, గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం జిల్లా అధ్యక్షులు ఉరిగిటి శివ సుర్యనారాయణ, వార్డు మెంబర్ ఉరిగిటి ఆదినారాయణ, ఉరిగిటి మహాలక్ష్మి నాయుడు, సుబ్బి సత్యారావు, పాము గోవింద, గొర్లి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు వేట నిషేధ పరిహారం చెల్లించాలి

ప్రజా చైతన్య యాత్రలో సిపిఎం నేతలు



మత్స్యకార మహిళలతో మాట్లాడుతున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మత్స్యకారులకు వేట నిషేధ పరిహారం చెల్లించాలని సిపిఎం అచ్చుతాపురం మండల కన్వీనర్ ఆర్ రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం ప్రజా చైతన్య యాత్ర శుక్రవారం మండలంలోని పూడిమడకలో సాగింది. గ్రామంలో మత్యకారులను కలిసి వారి ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ మత్స్యకార భరోసా, ఫార్మా పైప్‌లైన్ ప్యాకేజీ లక్ష పాతికవేల రూపాయలు నేటికీ అందలేదని పేర్కొన్నారు. పైప్ లైన్ వేయడం వలన సముద్రంలో రసాయన వ్యర్థ పదార్థాలు కలిసి మత్స్య సంపద అంతరించిపోయి వేట సాగడం లేదని తెలిపారు. దీంతో ఉపాధి లేక మత్స్యకారులు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎస్ఇజెడ్, ఫార్మా పరిశ్రమల్లో పూడిమడక పేరు చెబితే పనులు ఇవ్వడం లేదని, ఐటిఐ, డిగ్రీ, డిప్లొమా, బిటెక్ లాంటి ఉన్నత చదువులు చదువుకున్న యువత కూడా ఉపాధి లేక ఖాళీగా ఉంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శి చేపల తాతయ్య, దేవుడమ్మ, నాయకులు కే.సోమినాయుడు, కనగళ్ల నూకరాజు, లక్ష్మి, గంటలమ్మ పాల్గొన్నారు.

రాంబిల్లి : మండలంలోని కొత్తపట్నం మత్స్యకారుల గ్రామంలో శుక్రవారం సిపిఎం నాయకులు ప్రజాచైతన్య యాత్ర నిర్వహించారు. మత్స్యకారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి జి దేవుడు నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు వేటనిషేధ పరిహారం ఏడాది గడుస్తున్నా అందించలేదన్నారు. నేవల్ బేస్ వలన తమ ఉపాధి పూర్తిగా దెబ్బతిన్నదని, ఎన్ఏఓబి నిర్మాణంలో నిర్మాణ పనులో తమకు ఉపాధి కల్పించడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, ధోని కాసియా, నాగు మంత్రి నారాయణరావు, చోడుపిల్లి అప్పలరాజు, యూ అప్పారావు, సిహెచ్ ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.



తీరంలో మత్స్యకారులను కలిసిన సిపిఎం నాయకులు

బాలికలకు కరాటే శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట బాలికలు వసతి గృహంలో 150 మంది బాలికలకు కరాటే శిక్షణ శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కశింకోట ఎస్ఐ కె.లక్ష్మణ్ రావు హాజరై మాట్లాడారు. స్వీయరక్షణ నైపుణ్యాలు బాలికలకు ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని తెలిపారు. కరాటి శిక్షకడు ఈస్వరరావు ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ లు హాస్టల్ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని గవర్ల అనకాపల్లి గ్రాడ్యుయేట్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని (వాట్సాప్ గ్రూప్) ద్వారా ఎన్నికైంది. ఈ మేరకు క్లబ్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. నూతన కమిటీ గౌరవాధ్యక్షురాలిగా ఎం.వి.సుధా అప్పారావు (శివశంకర్ విద్యానికేతన్ అధినేత) అధ్యక్షునిగా దొడ్డి శ్రీధర్ (నారాయణ కాలేజీ లెక్చరర్), కార్యదర్శిగా పల్లం రవితేజ (హెచ్ఆర్ మేనేజర్ ఫార్మాసిటీ), ఉపాధ్యక్షులుగా అంగులూరి రామకృష్ణ, సహాయ కార్యదర్శిగా దాడి వెంకటేష్, కోశాధికారిగా ఆళ్ల నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ రెండు సంవత్సరాల కాల పరిమితిలో నడిచే ఈ కార్యవర్గం దేశ ,విదేశాల్లో ఇతర రాష్ట్రాలలో విధి నిర్వహణలో ఉన్న వారినందరిని సమన్వయం చేసుకుంటూ విద్య, క్రీడలు, గ్రామాభివృద్ధికి కృషి చేస్తుందని చెప్పారు.

రింగు లైట్లు ప్రారంభం

ప్రజాశక్తి-పరవాడ : గ్రేటర్ విశాఖ 79వ వార్డు లంకల పాలెం ఎస్సీ కాలనీలో, స్మశాన వాటిక, కరణం వీధి, శివాని నగర్లో, మరిడి మాంబ కాలనీలో, లంకలపాలెం జంక్షన్, వినాయక నగర్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన రింగు లైట్లను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ఎర్ర కోటేశ్వరరావు, దాసరి రామారావు, రౌతు వరాహ నరసింహమూర్తి, గనిరెడ్డి రామారావు, అప్పికొండ కృష్ణ, అప్పికొండ నర్సింగు, అప్పికొండ నరసమ్మ, అర్జును, ఎర్ర అప్పలరాజు, కర్రి జువ్వలు, మాలతి, అన్నపూర్ణ పాల్గొన్నారు.

నూకాంబిక జాతర పోస్టర్ విడుదల

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి తాకాశి వీధిలో ఉన్న శ్రీ నూకాంబిక అమ్మవారి జాతర వాల్ పోస్టర్‌ను అనకాపల్లి జనసేన నియోజకవర్గం ఇంచార్జి భీమర శెట్టి రామకృష్ణ (రాంకీ) చేతుల మీదుగా పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, తాకాశి కన్నా బాబు (చిన్ని), శ్రీ రాందాస్ గోవిందు, తాడి రామకృష్ణ, తాకాశి సత్యం దొర, అప్పికొండ గణేష్, మంగ ఈశ్వర్, బర్ని కాన రాము, ఉత్సవ కమిటీ చైర్మన్, తాకాశి కిషోర్, ఉత్సవ కమిటీ మెంబెర్స్ పాల్గొన్నారు.

ఎస్‌జిటిలకు మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేపట్టాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్రంలోని త్వరలో చేపట్టనున్న ఉపాధ్యాయ బదిలీల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లతో సహా అన్ని స్థాయిల బదిలీలను మాన్యువల్ కౌన్సిలింగ్ విధానంలో నేరుగా ఉపాధ్యాయులు ఎంచుకునే విధంగా నిర్వహించాలని టిడిపి అనుబంధ నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుంపాల వెంకటరమణ, నక్కా శ్రీనుబాబు కోరారు. అనకాపల్లి గోవిందరావు భవనంలో శుక్రవారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. బదిలీలకు సంబంధించి అన్ని సమస్యలను ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి సభ్యులు డాక్టర్ వేపాడ చిరంజీవిరావు ద్వారా మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఎస్జీటీలకు మాత్రం ఆన్లైన్ కౌన్సిలింగ్‌ను ఉపాధ్యాయులంతా వ్యతిరేకిస్తున్నందున దీనిపై మంత్రి నారా లోకేష్ ప్రత్యేక దృష్టి పెట్టి మాన్యువల్ కౌన్సిలింగ్ ద్వారానే అన్ని బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో గిరిజన ప్రాంతానికి దిలీ అయిన మైదాన ప్రాంత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎస్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర నాయకుడు రొంగలి అప్పలరాజు, సంఘ ప్రతినిధులు కోట్ని రాంబాబు, వీరునాయుడు, లక్ష్మణ్, లోకేష్, విద్యాసాగర్, రాజా రమేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అనకాపల్లి మండల శాఖ ఎన్నికల్లో అధ్యక్షులుగా సిహెచ్. లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా కె.విద్యాసాగర్ ఎన్నికయ్యారు.

డిఎస్‌సి ఉచిత శిక్షణ దరఖాస్తుకు తుది గడువు నేడే

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేయబోయే మెగా డిఎస్‌సి పరీక్షకు హాజరయ్యే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించుటకు వెబ్ ఆప్షన్స్ అందుబాటులో ఉన్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారిత అధికారి కె.రాజేశ్వరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఎస్సీ ఉచిత శిక్షణ కోసం ఎస్సీ ఎస్టీ వర్గాలకు చెందిన షార్ట్ లిస్టు చేయబడిన అభ్యర్థులు వారి ప్రాధాన్యత ప్రకారం కోచింగ్ సంస్థలు కేటాయించుటకు గాను వెబ్ ఆప్షన్స్ 15వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. వెబ్ ఆప్షన్స్ "సర్వీస్ జన్మభూమి", https://mdfc.apcfss.in వెబ్ పోర్టల్ లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. షార్ట్ లిస్ట్ చేయబడిన ఎస్సీ, ఎస్టీ డీఎస్సీ అభ్యర్థులు కోచింగ్ సెంటర్ ఎంచుకొనుటకు 15న తమ ప్రాధాన్యతను నమోదు చేసుకోవాలని తెలిపారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : 2025-26 విద్యా సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు ధరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు గురుకుల పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్ వివి. రాజేంద్రప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకుల పాఠశాలల్లో 5, 6, 7, 8 తరగతులు, ఇంటర్ ప్రథమ సంవత్సరం, డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరడానికి మార్చి 1వ తేదీ నుండి 31వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆన్లైన్ విధానంలో https://aprs.apcfss.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పాఠశాలల్లో ప్రవేశాలకు ఏప్రిల్ 25వ తేదీన ఉదయం, కళాశాలలో ప్రవేశాలకు అదేరోజు మధ్యాహ్నం ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుందని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

'స్వయం ఉపాధి' రుణాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-సబ్బవరం : వివిధ ప్రభుత్వ కార్పొరేషన్‌ల ద్వారా స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేసేందుకు అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక ఎంపీడీవో పి.పద్మజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని బీసీ, కాపు, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కార్పొరేషన్లకు సంబంధించిన లబ్దిదారులకు వ్యవసాయం / అనుబంధ, రవాణా, పరిశ్రమలు, సేవలు, వ్యాపార రంగాల్లో రుణాలు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ నెల 22వ తేదీ వరకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని చెప్పారు. ఈ అవకాశాన్ని లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ మండలం వాడచీపురుపల్లి, మెట్టపాలెం ఎస్సీ హాస్టల్లో చదువుతున్న పదోతరగతి విద్యార్థులు 43 మందికి పెన్నులు, పెన్సిళ్లు, జామెంట్రీ బాక్స్, పరీక్ష అట్టలు తదితర పరీక్షా సామాగ్రిని శుక్రవారం పంపిణీ చేశారు. ఎన్టీపీసి సింహాద్రిలో సబ్ ఆఫీసర్‌గా ఉద్యోగం చేస్తున్న రుగడ లక్ష్మి తన సొంత నిధులతో వీటిని అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడికి ఆందోళనకు గురికాకుండా, సమయపాలన పాటించి, శ్రద్ధగా చదివి, మంచిగా రాసి పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కుల సాధించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పరీక్షా సామగ్రి పంపిణీ చేసిన ఎన్‌టిపిసి ఉద్యోగి లక్ష్మి

21న గోవాడ సుగర్స్ సమస్యలపై మహాధర్నా

రైతు, కార్మిక, ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం

ప్రజాశక్తి-చోడవరం

మండలంలోని గోవాడ సుగర్ ఫ్యాక్టరీ, రైతులు, కార్మికుల సమస్యలపై ఈ నెల 21న ఫ్యాక్టరీ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు రైతు, కార్మిక, ప్రజా సంఘాల నేతలు తెలిపారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ సమస్యలపై స్థానిక అంబేద్కర్ భవన్లో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ రైతులు, కార్మికులకు బకాయిలు చెల్లించాలని, ఫ్యాక్టరీ ఆధునికీకరణకు నిధులు కేటాయించాలని, తక్షణమే ఫ్యాక్టరీ రిపేర్లకు రూ.35 కోట్లు విడుదల చేయాలని ఈ సమావేశం తీర్మానించింది. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, రైతు కూలీ సంఘం నాయకులు కోన మోహన్, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, సిఐటియు జిల్లా కోశాధికారి వి.వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫ్యాక్టరీని రైతాంగం, ప్రజలు కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, ఇందు కోసం ఈనెల 21న జరుగు ధర్నాలో రైతులు, కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ఫ్యాక్టరీ పరిధిలోని రైతాంగం తీవ్ర ఇబ్బందులు పాలవుతున్నారని, ఏ రోజు ఫ్యాక్టరీ ఆగిపోతుందో తెలియని స్థితికి తీసుకొచ్చారని విమర్శించారు. ఇదే పరిస్థితి కొనసాగితే వచ్చే సీజనకు చెరకు లేక ఫ్యాక్టరీ మూతపడే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ మూతపడితే ఈ ప్రాంతమంతా ఎడారిగా మీరే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోనే సహకారంగంలో నడుస్తున్న గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఆధునికీకరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.110 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు ఎస్వి.నాయుడు, జి.నాయన బాబు, ఆర్ దేముడు నాయుడు, ఈఎస్ మూర్తి, దేముళ్ళ, డి తాతారావు, నర్సింగరావు, నాగిరెడ్డి సత్యనారాయణ, ఏ.అప్పలనాయుడు, వి.సత్యం, దొర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షులు అప్పారావు, చిత్రంలో సంఘాల నేతలు


ప్రదర్శనలో ఉంచిన లేగ దూడలు

లేగ దూడల ప్రదర్శన

ప్రజాశక్తి-వద్దాది : బుచ్చయ్యపేట మండలం విజయరామరాజుపేటలో పశు సంవర్ధక శాఖ పశుగణాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. 42 లేగ తోటలను రైతులు ప్రదర్శనలో ఉంచారు. ఈ ప్రదర్శనలో మొదట మూడు స్థానాలకు బహుమతులను అందించారు. మొదటి బహుమతి రాపేటి సత్యనారాయణ, రెండో బహుమతి రాపేటి సన్యాసినాయుడు, మూడో బహుమతి శిలపరశెట్టి మహలక్ష్మి నాయుడు లేగదూడలకు వచ్చాయి. ఈ పోటీలకు తీసుకువచ్చిన రైతులకు కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రవిచంద్ మాట్లాడుతూ పెయ్యి పుట్టిన పది రోజులకు ఒకసారి నట్టల నివారణ మందును వేయటంతో పాటు ప్రతి నెలకు ఒకసారి ఆరు నెలలపాటు నట్టల నివారణ మందును వేయించాలని సూచించారు. ఆవు, గేదెలు 60 రోజుల నుండి 90 రోజులలోపు చూడికట్టే ఇంజక్షన్ చేయించడం వల్ల చూడి కట్టే శాతం మెరుగ్గా ఉంటుందని తెలిపారు ఈ సందర్భంగా రైతులకు లవణ మిశ్రమం ప్యాకెట్లను ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు డాక్టర్ సౌజన్య, కె.వాత్సవి, స్థానిక నాయకులు దొడ్డి కిషోర్, ఎంపిటిసీ బాలకృష్ణ, రాజారావు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

ఘనంగా బుదిరెడ్డి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట జనసేన పార్టీ కార్యలయంలో పార్టీ మండల అధ్యక్షులు బుదిరెడ్డి చిన్నా పుట్టినరోజు వేడుకలు గురువారం రాత్రి ఘనంగా జరిగాయి. ముందుగా కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు దాడి నాగరాజు, బలిజ ముసిలి నాయుడు, కర్రి వెంకట సత్య నారాయణ, కలగా చిరంజీవి, బుదిరెడ్డి మోహన్ పాల్గొన్నారు.

రేపు సిపిఐ మండల మహాసభ


ప్రజాశక్తి-కె.కోటపాడు : సిపిఐ మండల మహాసభ ఈనెల 16వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి గొర్లె దేవుడి బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేదలకు ఇళ్ల పట్టాల సమస్యపై చర్చించడం జరుగుతుందన్నారు. గోవాడ చక్కెర కర్మగారంపై ప్రభుత్వం చేస్తున్న అలసత్వం కారణంగా అనేక మంది చెరకు రైతులు నష్టాల బారిన పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మహాసభకు పార్టీ నేతలు బాలేపల్లి వెంకటరమణ, రాజాన దొరబాబు హాజరవుతారని తెలిపారు.

మోదకొండమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని పైడంపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన మోదకొండమ్మ ఆలయ ప్రతిష్ఠా కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు అంపోలు ఉమామహేశ్వర శర్మ ఆధ్వర్యంలో గత మూడు రోజుల నుండి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గుల్లేపల్లి, మల్లం పాలెం, పాచిలవానిపాలెం, చౌడువాడ గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

తాగునీటి బోరు ఏర్పాటు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని చిట్టియ్యపాలెం గ్రామంలో తీవ్రమైన తాగునీటి ఎద్దడి కారణంగా జిల్లా పరిషత్ నిధులతో స్థానిక జడ్పిటిసి దొండ రాంబాబు మూడు తాగునీటి బోర్లు వేశారు. దీంతో గ్రామంలోని యువకులు జడ్పీటీసీ రాంబాబుకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల నాయకులు, సర్పంచులు, ఎంపిటీసీలు, యువకులు పాల్గొన్నారు.


బోరుబావి పనులను ప్రారంభిస్తున్న జెడ్పిటిసి రాంబాబు

ఎంఎస్ఎంఇ విద్యా సంస్థలపై అవగాహన

ప్రజాశక్తి- అనకాపల్లి : కేంద్ర ప్రభుత్వ ఏర్పాటు చేసిన ఎమ్ఎస్ఎమ్ఈ సాంకేతిక విద్యా సంస్థపై అనకాపల్లి పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే ఎపి బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం అచ్యుతాపురం ఎమ్ఎస్ఎమ్ఈ సంస్థ అధ్యాపకులు డాక్టర్ కె.వెంకట అప్పారావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వం సాంకేతిక విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఎమ్ఎస్ఎమ్ఈ విద్యాసంస్థలను ఏర్పాటు చేసిందని తెలిపారు. అందులో భాగంగా అచ్యుతాపురంలో ఉన్న పారిశ్రామికవాడలో అన్ని సౌకర్యాలతో ఎమ్ఎస్ఎమ్ఈ విద్యా సంస్థను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 10వ తరగతి అనంతరం ఈ సంస్థలో డిప్లమా కోర్సుల్లో ప్రవేశ పొందడం ద్వారా మూడు సంవత్సరాలు కోర్స్ పూర్తి చేసుకుని, వెంటనే సంస్థ ద్వారా ప్రఖ్యాత పరిశ్రమల్లో ఉపాధి, ఉద్యోగ అవకాశాలను పొందవచ్చని తెలియజేశారు. బీటెక్‌లో కూడా ప్రవేశం పొందవచ్చని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లు కూడా విద్యార్థులు పొందవచ్చన్నారు. ప్రవేశ పరీక్షకు ప్రస్తుతం ఆన్లైన్ అప్లికేషన్ అందుబాటులో ఉందని, ఏప్రిల్ 30వ తేదీ లోపు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎంట్రన్స్ పరీక్ష మే నాలుగో తేదీన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ దేవరశెట్టి వెంకటేశ్వర్లు, హిందీ అధ్యాపకులు మహేంద్ర నాథ్ పట్నాయక్, ఆంగ్ల అధ్యాపకురాలు సుహాసిని, పాఠశాల యాజమాన్య కమిటీ వైస్ చైర్మన్ కర్రి గంగాధర్, 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

సాఫ్ట్ స్కిల్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ 3వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు, నిర్మాణ్ భారత్, టెక్ మహేంద్ర ఫౌండేషన్, స్మార్ట్ ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్ విశాఖపట్నం వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగ కల్పన కొరకు కావలసిన సాఫ్ట్ స్కిల్స్‌పై అవగాహన కల్పించినట్లు ప్రోగ్రాం మేనేజర్ దుర్గా ప్రసాద్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనీ మొబిలైజర్ దుర్గా ప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ బి సీతాలక్ష్మి, కళాశాల కెమిస్ట్ అధ్యాపకులు డాక్టర్ వివి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి- కె.కోటపాడు : విశాఖ డెయిరీకి పాలు పోసిన పాడి రైతులకు, వారి పిల్లలకు సుందరపు సత్యనారాయణ చేసిన సేవలు మరువరానివని విశ్రాంత ఉపాధ్యాయులు ఈర్ల అప్పారావు, గ్రామ సర్పంచి దాడి ఎరుకు నాయుడు, వైసీపీ నాయకులు దాట్ల శివాజీ రాజు అన్నారు. మండలంలోని చౌడువాడ గ్రామంలో సత్యనారాయణ స్వగృహంలో శుక్రవారం సత్యనారాయణ 14వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన జ్ఞాపకార్థంగా చౌడువాడ జిల్లా పరిషత్ హైస్కూల్లో నుండి 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే 100 విద్యార్థులకు సామాగ్రి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యనారాయణ విశాఖ డెయిరీ డైరెక్టర్‌గా ఉన్న సమయంలో పాడి రైతులకు చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. రైతుల పిల్లలకు విద్య, వైద్యం అందించి వారి మదిలో సుస్థిరమైన స్థానాన్ని పొందారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ కుమారులు గంగాధర్, మహాలక్ష్మి నాయుడు, ఎంపిటీసీ ఏటుకూరు రాజేష్, వైస్ ఎంపిపి రొంగలి సూర్యనారాయణ, పాల సొసైటీ అధ్యక్షులు కుమార వెంకటరమణ, సొసైటీ పిఎస్ చిన్ని వెంకట నరసింహమూర్తి, కుమార ఎర్రి నాయుడు. పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల గవరపేట వీధి దేవాంగుల వీధి రోడ్డుకు మోక్షం లభించింది. సుమారు 40 ఏళ్ల నుంచి ఈ రోడ్డు వెయ్యాలని స్థానికులు డిమాండ్ చేస్తూ వచ్చారు. ఈ మేరకు తుమ్మపాల గవరపేట వీధి శతకం పట్టు నుండి దేవాంగుల వీధి వరకు సిసి రోడ్డు వేయాలని నిర్ణయించారు. తుమ్మపాల గ్రామపంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి 60లక్షల రూపాయలు ఖర్చు చేయుటకు గ్రామ సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు నిధులు మంజూరు చేశారు. రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి అధికారులకు కాంట్రాక్టర్లకు నాణ్యతతో సిసి రోడ్డు నిర్మాణం చేయాలని సర్పంచ్ సూచించారు. కార్యక్రమంలో ఎంపిటీసీ పంచదార్ల కన్నారావు, వార్డు మెంబర్లు తర్రా సత్యారావు, వెలగా మోది నాయుడు, రవ్వా శ్రీను పాల్గొన్నారు.

రామనగర్ అభివృద్ధికి ఎమ్మెల్యే చేయూత


మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న జనసేన నేతలు

ప్రజాశక్తి-యలమంచిలి : మున్సిపాలిటీలోని భౌగోళికంగా అతిపెద్ద వార్డుగా గుర్తించబడిన 25 వార్డు రామనగర్‌లో మౌళిక సదుపాయాలు కల్పనకు ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ చేయూతను అందించనున్నట్లు జనసేన పార్టీ మున్సిపాలిటీ ప్రతినిధులు కొరారు శ్రీనివాసారావు, ఉదయ్‌కుమార్ తెలిపారు. పెద్దపల్లి రైల్వే గేటు రాకపోకలకు పెద్ద అవరోధంగా నిలిచిందని దాన్ని అధిగమించడానికి త్వరలోనే అక్కడ రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపడతామని ఇప్పటికే కూటమి ప్రభుత్వం తరపున ఎమ్మెల్యే విజయకుమార్ ప్రకటించారని గుర్తు చేశారు. రామనగర్‌లో టిడ్కో ఇళ్ల ప్రారంభం కావడంతో రైతుబజారు లాంటి ఏర్పాట్లు చేయాల్సి ఉందన్నారు. ప్రధానంగా రామనగర్‌లో మురుగునీటి వ్యవస్థ, రోడ్లు, మొక్కలు నాటడం మొదలైన కార్యక్రమాలు చేపట్టాలని జనసేన నాయకులు మున్సిపల్ కమిషనర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. కమిషనరు ప్రసాదరాజు స్పందిస్తూ రామనగర్‌ను స్వయంగా సందర్శించి తగిన ఏర్పాట్లకు కార్యాచరణ పథకం రూపొందించడం జరుగుతుందని చెప్పారు.

పార్టీ కోసం కష్టపడిన వారికి పదవులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు త్వరలో నామినేటెడ్ పదవులు వరిస్తాయని ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. అచ్యుతాపురం శిల్ప లేఅవుట్‌లో శుక్రవారం టిడిపి మండల కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో బూతులు వారీగా కుటుంబ సాధికారిక సారధలను నియమించాలని చెప్పారు. ప్రతి 60 మంది ఓటర్లకు సాధికార సభ్యులను గుర్తించి తెలుగుదేశం పార్టీ అభ్యున్నతకు తోడ్పడాలని ఆయన తెలిపారు. త్వరలోనే నామినేటెడ్ పదవులు భర్తీ జరగనుందని కష్టపడిన ప్రతి కార్యకర్తను పార్టీ గుర్తిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సాయిక్రిష్ణ, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దూళి రంగనాయకులు, మండల టిడిపి అధ్యక్షులు జనపరెడ్డి నర్సింగరావు, పార్టీ నాయకులు లాలం భరత్, పీల తులసి రాము, మెరుగు బాపు నాయుడు, పి కొండబాబు కే సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రూ.25 లక్షలతో సెంట్రల్ లైటింగ్

ప్రజాశక్తి-యలమంచిలి : ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కృషి ఫలితంగా రైల్వే స్టేషన్ రోడ్డు మధ్యలో వీధి దీపాలు అమర్చే కార్యక్రమం శుక్రవారం మొదలైంది. బస్టాండు, రైల్వే స్టేషన్ మధ్యలో ఇటీవల నూతనంగా నిర్మించిన విశాలమైన రోడ్డు మధ్యలో నిర్మించిన డివైడర్ మధ్యలో వీధి దీపాలు నెలకొల్పే పని చేపట్టారు. విఎంఆర్డీఏ రూ.25 లక్షల ప్రత్యేక నిధులతో 25 వీధి దీపాలు అమర్చుతున్నట్లు కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. నిర్మించిన రోడ్డుతో పాటు వీధిదీపాలు కూడా విఎంఆర్డీఏ నిధులతోనే చేపట్టినట్లు చెప్పారు. సుందరీకరణ పనులు మాత్రం మున్సిపాలిటీ చేపట్టిందని చెప్పారు.

బార్లు మాదిరిగా మద్యం షాపులు

-ఉదయం 8 గంటలకే తెరుచుకుంటున్న వైనం-పట్టించుకోని అధికారులు



ఘాట్‌రోడ్డులో మద్యం షాపు పక్కన గదిలో తాగుతున్న మందుబాబులు

ప్రజాశక్తి - మాడుగుల: ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తూ యదేచ్ఛగా మద్యం గొలుసు దుకాణాలు ఏర్పాటు చెయడంతో పాటు, లైసెన్స్ మద్యం దుకాణాలు పక్కనే బారు మాదిరిగా ఏర్పాటు చేస్తున్నారు. అయినా సంబంధిత శాఖ అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మద్యం షాపులు తెరవాల్సి ఉంది. కానీ ఉదయం 8 గంటలకే తెరిచి అమ్మకాలు సాగిస్తున్నారు. ఇదీ మండలంలో మద్యం దుకాణదారుల పరిస్థితి.

మాడుగుల కేంద్రంతో పాటు మండలంలో ఆరు లైసెన్స్ మద్యం దుకాణాలు ఉన్నాయి. లైసెన్స్ మద్యం దుకాణాల పరిధిలో బెల్టు షాపులు నిర్వాహణ, మద్యం దుకాణాల పక్కన బార్లు మాదిరిగా మందుబాబులు కూర్చోని తాగేందుకు నిబంధన లేదు. ఇందుకు విరుద్ధంగా మద్యం దుకాణాల పక్కనే మద్యం తాగేందుకు అవకాశం కల్పిస్తూ బార్లు మాదిరిగా గదులను ఏర్పాటు చేశారు. సిట్టింగులకు అవకాశం కల్పిస్తున్న పరిస్థితిపై సీనియర్ సిటిజన్స్, ప్రజలు తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నారు. మద్యం దుకాణాల పక్కన బార్లు మాదిరిగా ఏర్పాటు చేసిన గదులలో కూర్చుని మద్యం సేవిస్తున్నారు. ఇది అంతా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌కి కూతవేటు దూరంలో జరుగుతున్నప్పటికీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఆ శాఖ అధికారులు మద్యం దుకాణాల తనిఖీలకు వెళ్లినప్పుడు సైతం బార్లు మాదిరిగా ఉన్నా ఆ శాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు.

ఇదిలా ఉండగా మద్యం బాటిళ్లపై ఉన్న ఎమ్మార్పి ధర కంటే పది రపాయలు సైతం వసూలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. ఎమ్మార్పి ధరలకన్నా ఎందుకు అదనంగా వసూలు చేస్తున్నారని ఘటీరోడ్డులో ఓ మద్యం దుకాణదారుడుని విలేకర్లు ఆరా తీశారు., బాటిళ్లపై ఎమ్మార్పి ధరలు ఉన్నప్పటికీ, తమకు వచ్చే ఇండెంట్లో పది రూపాయలు అదనంగా పెంచి అమ్మాలని రావడంతో అదే విధంగా విక్రయిస్తున్నామని బదులిచ్చారు. ప్రతి షాప్ వద్ద మద్యం బాటిల్ల ధరలను ఏర్పాటు చేయడమే కాకుండా, టోల్ ఫ్రీ నెంబర్ మద్యం ప్రియులకు కనిపించే విధంగా బోర్డులు పెట్టాల్సి ఉండగా అది కూడా కానరాలేదు.

ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఉదయం వేళల్లో 10 గంటలకు ముందు రాత్రి పది గంటల తర్వాత షాపులు తెరిచి ఉంచి మద్యం బాటిళ్లలో కల్తీ చేస్తున్నారని విమర్శలు తీవ్ర స్థాయిలో వినిపిస్తున్నాయి.

దీనిపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ప్రసాద్ ని వివరణ అడుగగా ఎక్కడా అలాంటివి జరుగలేదన్నారు. షాపులు ఎప్పటిప్పుడు తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. మద్యం దుకాణాలు పక్కన ఎక్కడా మద్యం సేవించలేదని, అలా చేస్తే ప్రభుత్వ నిబంధనల ప్రకారం మద్యం దుకాణం లైసెన్స్ లను రద్దు చేస్తామని చెప్పారు.

వెంకన్న ఉత్సవాలకు పోటెత్తిన భక్తులు



ఉపమాక ఆలయంలో క్యూలో వేచి ఉన్న భక్తులు

ప్రజాశక్తి-నక్కపల్లి: ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు పోటెత్తారు. స్వామి వార్షిక తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం పౌర్ణమి సందర్భంగా పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. వేలాది మంది భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఆలయ ప్రధాన అర్చకులు వరప్రసాదాచార్యులు, కృష్ణ మాచార్యులు, శేషాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ట్రాన్స్ కో ఉద్యోగుల ఆధ్వర్యంలో భక్తులకు పులిహొూర పంపిణీ చేశారు. ఆలయం వద్ద మహిళలు, చిన్నారుల కోలాటం భక్తులను ఎంతగానో అలరించింది. ఉపమాక వెంకన్నను ఎమ్మెల్సీ సోము వీర్రాజు దర్శించుకున్నారు. హెూంమంత్రి వంగలపూడి అనిత ఆర్థిక సాయంతో భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. వెంకన్న ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రాజయ్యపేట సముద్రతీరంలో చక్రస్నానం వైభవంగా నిర్వహించారు. రాజాధిరాజ వాహనంపై స్వామి ఉపమాక గ్రామానికి 5కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజయ్యపేట సముద్ర తీరానికి తీసుకువెళ్లారు. విగ్రహానికి సముద్ర జలాలలో స్నానం చేయించారు.

వైభవంగా వెంకన్న వసంతోత్సవం

వడ్డాది: బుచ్చయ్య పేట మండలం వడ్డాది వెంకన్న వసంత ఉత్సవం అంగరంగ వైభవంగా జరిగింది వెంకటేశ్వర స్వామి ఆలయంలో నాగవెల్లి సందర్భంగా శుక్రవారం భక్తులతో క్యూ లైన్ లన్నీ కిక్కిరి పోయాయి మెట్ల మార్గాలు రోడ్డు మార్గాలతో గిరిజాంబగిరి రద్దీగాపోయింది. స్థానిక నాలుగు రోడ్ల కూడలి నుండి కొండ వరకు రోడ్లన్నీ భక్తులతో కిక్కిరి సాయి. ట్రాఫిక్ జామ్ ఏర్పడటంతో కొంతసేపు బిఎన్ రోడ్డు వద్ద వాహనాలు నిలిపేశారు. స్థానిక యువజన సంఘాలు, కాలనీవాసులు పులిహార, మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు అందించారు. ఎస్సై శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. నర్సీపట్నం నుండి చోడవరం వెళ్లే వాహనాలు బంగారు మెట్ట, వీరవెల్లి అగ్రహారం మీదగా పంపించారు.

జనసేన ఆవిర్భావ సభకు తరలి వెళ్లిన శ్రేణులు



అనకాపల్లి నుంచి వెళుతున్న నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి : పిఠాపురంలో జరిగిన జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభకు ఆ పార్టీ అనకాపల్లి నియోజకవర్గం ఇన్‌ఛార్జి రాంకీ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ బైక్ ర్యాలీ, సుమారు 2000 వాహనాలతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. దీంతో పండగ వాతావరణం నెలకొంది.

అచ్యుతాపురం : జనసేన పార్టీ ఆవిర్భావ సభకు ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, జనసేన పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల కన్వీనర్ సుందరపు సతీష్ కుమార్‌ల ఆధ్వర్యంలో 2000 మంది కార్యకర్తలు బైక్ ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బి.రాందాస్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సబ్బవరం : జనసేన ఆవిర్భావ దినోత్సవ సభకు సబ్బవరం పంచాయతీకి చెందిన జనసేన నేతలు టి. శేఖర్, బంతికోళ్ల పద్మ, జెట్టి ప్రసాద్ ఆధ్వర్యంలో భారీగా తరలి వెళ్లారు. కార్యక్రమంలో పల్లా రమణ, సబ్బవరపు రమణ, ఎన్.కొండబాబు, జి. మన్మధరావు, గొల్ల అర్జున్, కొల్లి కృష్ణ పాల్గొన్నారు.

కశింకోట : జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని కశింకోటలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని పార్టీ మండల అధ్యక్షులు బుదిరెడ్డి చిన్న ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పావాడ కామరాజు, దాడి నాగరాజు, ఉత్తడ రామరాజు, వేగ రామకోటి, బొడ్డేడ బాలాజీ, గొంతిన అప్పాజీ, బుదిరెడ్డి మోహన్, బొబ్బరి పవన్, సంతోష్, సాకేత్ పాల్గొన్నారు. మండలంలోని అచ్చర్లలో జరిగిన కార్యక్రమంలో దొడ్డి నాగేశ్వరరావు, నిమ్మదల సన్యాసినాయుడు, నైనముశెట్టి భూషణం, పొన్నాడ జాన్ పాల్గొన్నారు.

పద్మనాభం : పిఠాపురంలో జనసేన ఆవిర్భావ దినోత్సవానికి మండలంలోని 22 గ్రామ పంచాయతీల నుంచి సుమారు వంది మంది జనసేన నేతలు, కార్యకర్తలు ఒక బస్సు, పదికార్లులో బయలుదేరివెళ్లారు. పార్టీ మండల అధ్యక్షులు కురిమిన స్వామి నాయుడు ఆధ్వర్యంలో వీరంతా తరలివెళ్లారు.

సీతమ్మధార : జనసేన 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని విశాఖ నగర జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ జెండాను శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. అనంతరం నియోజకవర్గం నుంచి పెద్దసంఖ్యలో జనసేన నేతలు, కార్యకర్తలు, పిఠాపురంకు తరలివెళ్లారు. కార్పొరేటర్లు వసంత లక్ష్మి, నాగరాజు, జనసేన వార్డ్ అధ్యక్షులు, వార్డ్ ఇంచార్జిలు పాల్గొన్నారు.



కానరాని జనసేన పార్టీ ఆవిర్భావం

కోటవురట్ల: రాష్ట్రవ్యాప్తంగా ఎంతో ఘనంగా రాజమండ్రిలో నిర్వహిస్తున్న 14వ జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం మండలంలో మొక్కు బడి తంతుగానే నిర్వహించారు. మండలంలో గ్రూపు రాజకీయాలతో పార్టీ నాయకులు మండల కేంద్రంలో రెండు పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. నాయకులు గడ్డం బుజ్జి, శివ దత్త వేరువేరుగా పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. శ్రేణులను సక్రమంగా పట్టించుకోకపోవడంతో పార్టీ కార్యకర్తల్లో నిరుత్సాహం వ్యక్తమవుతోంది. కూటమి నాయకులలో కూడా మండల జనసేన పార్టీ కార్యకర్తలు అంటి అంటన్నట్లు ఉంటున్నట్లు తెలిసింది.

మండలంలో కాపు సామాజిక వర్గం ఎక్కువగా ఉన్నప్పటికీ కూడా అభిమానులు కూడా మరింత ఎక్కువగానే ఉన్నారు, పార్టీలో నాయకత్వ లేమి స్పష్టంగా కనిపించడంతో జనసేన పార్టీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



విచారణ చేపడుతున్న పోలీసులు

చోరీపై పోలీసుల విచారణ

ప్రజాశక్తి-కోటరట్ల: మండలంలో రామచంద్రం పాలెం శివారు సన్యాసిరాజుపాలెం గ్రామంలో సింగంపల్లి వరలక్ష్మి ఇంటిలో దొంగతనం జరిగినట్లు స్థానిక ఎస్సై రమేష్ తెలిపారు. వరలక్ష్మి కుటుంబ సభ్యులు గత నెల 26న ఇంటికి తాళం వేసి గుడివాడ వెళ్లి ఈనెల 13న ఇంటికి వచ్చారు. ఇంటి లోపల చూడగా ఇంట్లో దొంగతనం జరిగినట్లు గుర్తించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదులో 20వేల నగదు తో పాటు అర తులం బంగారం దొంగిలించుకుపోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమెరకు ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి క్లూస్ టీం సహాయంతో దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.



ర్యాలీ చేపడుతున్న విద్యార్థులు

గ్లకోమాపై నిర్లక్ష్యం చేయకండి

ప్రజాశక్తి- కోటవురట్ల: గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా మండలం కేంద్రంలో శనివారం ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ బాలికల హాస్టల్ వద్ద గ్లకోమా లక్షణాల పట్ల విద్యార్థులకు వివరించారు. గ్లకోమా లక్షణాలు జన్యుపరంగా సంక్రమించే వ్యాధితో పాటు అధిక డయాబెటిక్, బ్లడ్ ప్రెజర్ ఎక్కువగా ఉన్నవాళ్ళకు వ్యాధి సంక్రమించే అవకాశం ఉందన్నారు. వ్యాధి పట్ల నిర్లక్ష్యం చేయరాదని ఎల్వి ప్రసాద్ టెక్నీషియన్ సంధ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ గోపీనాథ్, ఎఫ్ ఎస్ ఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



వృథాగా ఉన్న ఐసిడిఎస్ భవనం

వృథాగా ఐసిడిఎస్ భవనం

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల కేంద్రంలో తహసిల్దార్ కార్యాలయ ఆరణలో గల శిశు సంక్షేమ శాఖ (ఐసిడిఎస్) భవనం వృథాగా దర్శనమిస్తుంది. గడచిన 30 సంవత్సరాలుగా కోటవురట్ల కేంద్రంగా మాకవరపాలెం, నాతవరం, కోటవురట్ల మండలాల శిశు సంక్షేమ శాఖ కు విశిష్ట సేవలు అందించిన ఈ కార్యాలయ సిడిపిఓను నక్కపల్లి సిడిపిఓగా మార్చడంతో కార్యాలయం వృథాగా దర్శనమిస్తుంది. ప్రస్తుతం నియోజకవర్గానికి ఒక సిడిపిఓను నియమించడంతో మండలానికి నక్కపల్లి సిడిపిఓ కార్యాలయం నుంచి పర్యవేక్షిస్తున్నారు. దాదాపు కోట్ల రూపాయలు విలువచేసే ఈ భవనం వృథాగా ఉండటంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. అధికారులు స్పందించి సంబంధిత భవనాన్ని వేరే విధంగా సద్వినియోగించుకునేందుకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-పెదబయలు: మండలంలో మారుమూల బొంగరం పంచాయతీ పరిధి మొట్టల గుమ్మి లో రోడ్డు నిర్మాణ పనులను అరకు తెలుగుదేశం పార్టీ ఇంచార్జి, ఏపీఎస్‌ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ దొన్ను దొర శుక్రవారం శంకు స్థాపన చేశారు. గిరిజన ప్రాంతంలో ప్రతి గ్రామానికి రహదారి సౌకర్యం ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఉందన్నారు.

ఘనంగా హోలీ సంబరాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : హోలీ సంబరాలను విశాఖ నగరంలో ప్రజానీకం ఘనంగా జరుపుకున్నారు. ఎయు సహా పలు విద్యా సంస్థల వద్ద సందడి వాతావరణం నెలకొంది. సముద్ర తీరం యువతతో కిటకిటలాడింది. రంగులు పూసుకుంటూ, సముద్ర స్నానాలు చేస్తూ సందర్శకులు, విద్యార్థులు, యువతీ యువకులు ఆనందోత్సాహాల మధ్య రోజంతా గడిపారు

పద్మనాభం: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ఇటుక బట్టీల్లో ఒడిశా నుంచి వచ్చి పనిచేస్తున్న వలస కార్మికులు శుక్రవారం హోలీ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని మద్దిచ పద్మనాభం, కృష్ణాపురం, పాండ్రంగి, రేవిడి, వికె.పాలెం తదితర గ్రామాల్లోని ఇటుకబట్టీల్లో హోలీ పండుగను పురస్కరించుకుని పండుగ వాతావరణం నెలకొంది. ఇటుకబట్టీల కార్మికులతో కుటుంబాలతో రంగులు చల్లుకుని సందడి చేశారు.

బుచ్చయ్యపేట : మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. యువతీ యువకులు పరస్పరం రంగులు చల్లుకొని హోలీ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.



స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

రాజయ్యపేట తీరం.. జనసంద్రం

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలో రాజయ్యపేట సముద్రతీరం శుక్రవారం జనసంద్రంగా దర్శన మిచ్చింది. ఫాల్గుణమాసం పౌర్ణమి సందర్భంగా భక్తులు రాజయ్యపేట సముద్ర తీరంలో సముద్ర స్నానాలు ఆచరించారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి వేలాది మంది భక్తులు స్నానాలు ఆచరించేందుకు తరలి వచ్చారు. సముద్రతీరం భక్తుల రాకతో కిటకిటలాడింది. నక్కపల్లి నుండి ఉపమాక మీదుగా రాజయ్యపేట వరకు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. సిఐలు కుమారస్వామి, రామకృష్ణ, ఎస్ఐలు సన్నిబాబు, విభూషణరావు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టారు.

హెచ్ఎస్ఎల్ డైరెక్టర్‌గా కిరణ్ బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హిందుస్థాన్ షిప్ యార్డ్ లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్) డైరెక్టర్ (ఫైనాన్స్ అండ్ కమర్షియల్)గా కిరణ్ ఈశంకరాల శుక్రవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఆయన 1997లో చార్టర్డ్ అకౌంటెంట్‌గా ఉత్తీర్ణత పొంది 1998లో ఆర్ఐఎన్ఎల్‌లో తన వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. అక్కడ కార్పొరేట్ ఖాతాలు, ట్రెజరీ, ప్రాజెక్ట్ ఫైనాన్స్, బడ్జెట్, అంతర్గత ఆడిట్ వంటి కీలక విభాగాలలో పనిచేయటంతో పాటు ఆర్ఐఎన్ఎల్ ఐపిఒ నిర్వహణలో పాలుపంచుకున్నారు. ఆర్ఐఎన్ఎల్, ఎంఒఐఎల్ మధ్య జాయింట్ వెంచర్ అయిన ఆర్ఐఎన్ఎంఒఐఎల్ ఫెర్రో అల్లాయ్స్ లిమిటెడ్ వ్యవస్థాపక చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్‌గా పనిచేశారు. ఆయన ఉత్తమ పనితీరుకు గుర్తింపుగా ప్రతిష్ఠాత్మక జవహర్ లాల్ నెహ్రూ అవార్డుతో పాటు ఆర్ఐఎన్ఎల్ నుంచి పలు పనితీరు సంబంధిత అవార్డులను అందుకున్నారు. హెచ్ఎస్ఎల్‌లో బాధ్యతలు చేపట్టడానికి ముందు కిరణ్ మార్చి 2024 నుంచి డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్‌గా పనిచేశారు. హెచ్ఎస్ఎల్‌లో డైరెక్టర్ (ఫైనాన్స్ అండ్ కమర్షియల్)గా ఆయన ఆర్థిక, వాణిజ్య కార్యకలాపాలను

ఎంవిపి రైతు బజార్‌లో

వ్యవసాయ మార్కెట్ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: విశాఖపట్నంలోని ఎంవిపీ రైతు బజార్‌లో వ్యవసాయ మార్కెట్ కమిషనర్ ఎం. విజయ సునీత శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.. రైతు బజార్‌లో రైతుల కార్డులు , డ్వాక్రా కౌంటర్లు, వ్యాపార దుకాణాల పరిశీలించారు. రైతులు తీసుకొస్తున్న టమాటాలు ను డ్వాక్రా షాపుల్లో అమ్ముతున్న ఉల్లిపాయలను నాణ్యతను పరిశీలించి వారి అమ్ముతున్న ధరలను అడిగి తెలుసుకున్నారు.రైతులకు అవసరమైన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి మూడవ శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం విధిగా నిర్వహించాలని, రైతులందరూ పాల్గొనాలని సూచించారు. బోర్డులపై సూచించిన ధరలకే కూరగాయలు అమ్మాలని, రైతు బజార్ పరిసరాలను పరిశు



సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్

భ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ పి సుధాకర్, డిప్యూటీ డైరెక్టర్ జి శ్రీనివాస్ కిరణ్, అసిస్టెంట్ డైరెక్టర్ షేక్. యాసిన్ రైతు బజార్ ఈఓ వరహాలు పాల్గొన్నారు.

నేడు, రేపు మెడికల్ రిప్స్ రాష్ట్ర మహాసభలు



మాట్లాడుతున్న రవికుమార్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలు ఈనెల 15, 16 తేదీల్లో రెండు రోజులు పాటు విశాఖపట్నం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరుగుతాయని యూనియన్ రాష్ట్ర సంయుక్త ప్రధాన కార్యదర్శి యు.ఎస్ రవికుమార్ తెలిపారు. శుక్రవారం జగదాంబ దరి సిఐటియు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజా ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత అనే నినాదంతో మహాసభ మొదలవుతుందన్నారు. రోగి అనారోగ్యంతో బాధపడుతుంటే ప్రభుత్వం ఆదుకోవడం బదులు వారు కొనుక్కున్న మందులపైన కూడా పన్నులు వేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో 5 శాతం ఆరోగ్యం కోసం ఖర్చు చేయాలన్నారు.నకిలీ, నాసిరకం మందులు అరికట్టాలన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను పునరుద్ధరించి నాణ్యమైన మందులు ప్రజలకు అందించవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మెడికల్ రిప్రజెంటేటివ్స్ అందరికి హైలీ స్కిల్ కేటగిరిగా గుర్తించాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి కెవిపి చంద్రమౌళి మాట్లాడుతూ, ప్రభుత్వం ఈ డిమాండ్లను ఆమోదించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని తెలిపారు.ఈ సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.వి సుధాకర్ రాష్ట్ర కమిటీ సభ్యులు సంజయ్ కుమార్,సేల్స్ రిప్రజెండెడ్ యూనియన్ నాయకులు కళాధర్ పాల్గొన్నారు.

నేడు జెడ్‌పి స్థాయీ సంఘాల సమావేశాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు శనివారం ఉదయం 10 గంటల నుంచి చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జరుగనున్నట్లు జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.నారాయణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు స్థాయీ సంఘాల సమావేశాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు 2వ, 5వ స్థాయీ సంఘాలు, మధ్యాహ్నం 11 గంటలకు 3, 4వ స్థాయీ సంఘాలు, మధ్యాహ్నం 12 గంటలకు 1, 6, 7వ స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అధికారులందరూ తమ శాఖల ద్వారా అమలవుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల సమగ్ర ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

జిల్లా కోర్టులో ఘనంగా మహిళా దినోత్సవం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: జిల్లా కోర్టులో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సంబరాలు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మహిళా న్యాయవాది భాస్కర్ లక్ష్మి మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో ఏర్పాటు అయిన ఎఐఎఫ్ డబ్ల్యుఎల్ నేషనల్ కమిటీ,స్టేట్ కమిటీతో మాట్లాడి విశాఖలో మహిళా న్యాయవాదుల భద్రతా సహాయ సహకారాల కోసం విశాఖ ఫెడరేషన్ ఆఫ్ వుమెన్ లాయర్స్ పేరుతో ఒక బ్రాంచ్ ని స్థాపించడం జరిగిందన్నారు. అప్పటి నుండి ఈఎఫ్ డబ్ల్యు ఎల్ కమిటీ స్టేట్ కమిటీ ఆధ్వర్యంలో మహిళలకి చైతన్యం కల్పిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళా న్యాయవాదులే కాకుండా ఎక్కడ ఏ మహిళలకు అన్యాయం జరిగినా, ఫెడరేషన్ ఆఫ్ విమెన్ లాయర్స్ ఖండిస్తూనే ఉంటున్నారు. మహిళా న్యాయవాదులను ఐక్యతగా ఉంచేందుకు కొత్త సంవత్సరం, సంక్రాంతి,ఉగాది,క్రిస్మస్ వంటి వివిధ కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.జాతీయ స్థాయిలో ఎఐఎఫ్ డబ్ల్యూ ఎల్‌కి నేషనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్‌గా సీనియర్ మహిళా న్యాయవాది పి. హేమమాలిని, సీనియర్ మహిళా న్యాయవాదుల ప్రెసిడెంట్‌గా కొప్పాక అరుణ, సెక్రటరీగా డి.అరుణ కుమారి,వైస్ ప్రెసిడెంట్ ధోని మంజులత, లీగల్ అడ్వైజర్ లక్ష్మి రాంబాబు వ్యవరిస్తున్నట్లు తెలిపారు.ఈ ఏడాది అధ్యక్ష కార్యదర్శుల పదవీకాలం ముగియడంతో అధ్యక్షురాలు మేరీ మణి ఆధ్వర్యంలో కొత్త కమిటీని ఎన్నుకోవడం జరిగిందన్నారు. కొత్త కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా డి.సునంద, జి.సూర్య ప్రభలని ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు కె.వి.రామ్మూర్తి, చింతపల్లి రాంబాబు, బివిఆర్ మూర్తి, బార్ కౌన్సిల్ మెంబర్లు కె.రామజోగేశ్వరరావు, పి. నరసింగరావు, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు, బెవర సత్యనారాయణ,దంత నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బోయ/వాల్మీకులను ఆదివాసీ జాబితాలో చేర్చొద్దు

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: బోయ/వాల్మీకులను ఆదివాసీ జాబితాలో చేర్చొద్దని ఆదివాసీ గిరిజన సంఘం కార్యదర్శి కుర్ర నర్సయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు శ్రీను మాట్లాడుతూ, తెలంగాణ బిజెపి ఎంపి డికె అరుణ బోయవాల్మీకులను గిరిజన జాబితాలో చేర్చాలని వ్యాఖ్యానించడం సరికాదని తీవ్రంగా ఖండించారు.ఎస్టీ జాబితాలో చేర్చి ఆదివాసీలకు అన్యాయం చేయవద్దన్నారు. బోయవాల్మీకిలను గిరిజన జాబితాలో చేర్చేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చూస్తున్నాయన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి నరసయ్య మాట్లాడుతూ, రంపచోడవరం ఎమ్మెల్యే శిరీష షెడ్యూల్ ఏరియాలో గిరిజనేతరులకు ఇల్లులు మంజూరు చేయాలని పేర్కొనడం సరికాదన్నారు.

పదేళ్ల తర్వాత కుటుంబం చెంతకు..

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 2016లో హైదరాబాద్‌లో అదృశ్యమైన నిజామాబాద్ జిల్లాకు చెందిన శ్రీను (45)ను విశాఖ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి చొరవతో శుక్రవారం ఉదయం ఈస్ట్ ఎసిపి అన్నెపు నరసింహ మూర్తి, ఎంవిపి పోలీసులు, రెడ్ క్రాస్ సిబ్బంది సంయుక్తంగా అతని కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎసిపి నరసింహమూర్తి ఆ వివరాలను వెల్లడించారు. ఈ నెల 11న మధ్యాహ్నం విశాఖపట్నం బీచ్ రోడ్డు మార్గంలో ప్రయాణిస్తున్న నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చికి రోడ్డు పక్కన అచేతనంగా పడి ఉన్న వ్యక్తి కనిపించాడు. అతనికి ఆయన ఆహారం అందించడంతో పాటు ఎంవిపి పోలీసుల సహాయంతో పెద్ద వాల్తేర్‌లోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారి హోం లెస్ షెల్టర్‌కు తరలించారు. అనంతరం అక్కడ ప్రాథమిక చికిత్స అందించారు. ఆ వ్యక్తి దగ్గర ఉన్న ఆధారాలతో తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్ జిల్లా మద్నూర్ స్వగ్రామంలోని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు శుక్రవారం ఉదయం విశాఖ చేరుకొని అతనిని గుర్తించారు. శ్రీనుకు వివాహం జరిగిందని, ప్రస్తుతం 18 సంవత్సరాల కూతురు, భార్య ఉన్నారని వారు తెలిపారు. మీడియా సమావేశంలో రెడ్ క్రాస్ సభ్యులు మురళి, ఎంవిపి స్టేషన్ సిఐ ఎస్.మురళి, ఎస్ఐలు మహంతి శ్రీనివాస్, ధనుంజయ నాయుడు, షేక్ ఖాదర్ బాషా పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎసిపి